తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
28 జూలై 2026



## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- ప్రజావాణికి 140 పిర్యాదుల స్వీకరణ: జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ బ్యూరో్ జులై 27 (జనంసాక్షి): సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టో మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ తో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జిదారుల సమస్యలను సావధానంగా విన్నారు. ప్రతి సమస్యను జాగ్రత్తగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి భరోసా ఇచ్చారు. అధికారులు ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకుని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, నీటిపారుదల, జిల్లా సంక్షేమం, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖ, భూ సర్వే రికార్డులు, గృహ నిర్మాణం, రోడ్లు రవాణా, పోలీస్, గిరిజన అభివృద్ధి శాఖ, ప్రణాళిక శాఖ, విద్యుత్ శాఖ, విద్య, వైద్య ఆరోగ్యం , అటవీ, గ్రామీణ అభివృద్ధి, తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 140 వినతులను అధికారులు స్వీకరించారు.

**జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష...**

ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలో వర్షాభావ పరిస్థితులు ఎదుర్కొన్నేందుకు అవకాశం ఉన్నందున నీటి సంరక్షణకు సంబంధించిన పనులను అత్యంత ప్రాధాన్యంతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇటీవల పంచాయతీరాజ్ శాఖ మంత్రి, పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని చేపట్టాల్సిన చర్యలపై ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. వాటి ప్రకారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు.జిల్లాకు మూడు నెలల్లో సుమారు 1,400 ఫార్మ్ పాండ్లు నిర్మించాలని లక్ష్యం నిర్దేశించారని తెలిపారు. ఇప్పటికే సుమారు 400 ఫార్మ్ పాండ్లను గుర్తించామని, మిగిలిన వాటిని రెండు రోజుల్లో గుర్తించి అంచనాలు సిద్ధం చేసి పరిపాలనా అనుమతులు పొందాలని ఎంపీడీవోలు, మండలస్థాయి అధికారులను ఆదేశించారు. పనులు వెంటనే ప్రారంభించి ఉపాధి అవకాశాలు కూడా కల్పించాలని సూచించారు.

మిగతా 12లో..

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ వేగవంతం

- ఎన్యూమరేషన్ ఫారాలు వెంటనే సమర్పించండి.. ఓటర్లకు కలెక్టర్ విజ్ఞప్తి
- ఫారాలు సమర్పించకపోతే ఓటరు జాబితాలో పేరు ఉండదు
- ఓటరు హక్కు కాపాడుకోవాలంటే ఎన్యూమరేషన్ ఫారం తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్‌నగర్ బ్యూరో, జులై 27 (జనంసాక్షి): జిల్లాలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను వేగవంతం చేసి, గడువులోగా 100 శాతం డిజిటైజేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఎన్యూమరేషన్ ఫారాలు తీసుకున్న ఓటర్లు వాటిని పూర్తిగా నింపి వెంటనే సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బి. ఎల్. ఓ లకు) అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఇంకా ఫారాలు సమర్పించని వారు వెంటనే సమర్పించాలని కోరారు. బి. ఎల్. ఓ లు ఎన్యూమరేషన్ ఫారాలు అందుకొని వివరాలను పరిశీలించి వెంటనే డిజిటైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్ణిత గడువు లోగా ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ పూర్తి చేసి 100 శాతం డిజిటైజేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్ల పేర్లు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు కావని, దీంతో వారు ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని కలెక్టర్ హెచ్చరించారు. కాబట్టి ప్రతి అర్హత కలిగిన ఓటరు తమ ఎన్యూమరేషన్ ఫారాన్ని సకాలంలో సమర్పించి, ముసాయిదా ఓటరు జాబితాలో తమ పేరు నమోదయ్యేలా చూసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, తప్పులు లేకుండా, వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రజలందరూ అధికారులకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కోరారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌కు చెక్... ఇద్దరు వాహనదారులకు జైలు శిక్షలు

- పునరావృతంగా మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరికి కఠిన శిక్షలు
- ఒకరికి 2 రోజులు, మరొకరికి 3 రోజుల జైలు శిక్ష విధించిన కోర్టు



గద్వాల నడిగడ్డ, జులై 27(జనంసాక్షి); జోగులాంబ గద్వాల జిల్లా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పదేపదే పట్టుబడుతున్న వాహనదారులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా గద్వాల పట్టణ పరిధిలో ట్రాఫిక్ పోలీసు వారి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పలుమార్లు పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు ఫస్ట్ అడిషనల్ జె.ఎఫ్.సి.ఎమ్. కోర్టు మెజిస్ట్రేట్ డి.వెంకటేష్ జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. శెట్టి ఆత్మకూరు గ్రామానికి చెందిన నాగరాజు,వయస్సు 22 సంవత్సరాలు, గతంలో రెండుసార్లు మద్యం సేవించి వాహనం నడుపుతూ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడటంతో, సోమవారం ఫస్ట్ అడిషనల్ జె.ఎఫ్.సి.ఎమ్. కోర్టు మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష ఇస్తూ వెల్లడించారు.

మిగతా 12లో..

## రెండు నెలల్లో స్త్రీ నిధి రుణాల రికవరీ 90 శాతానికి చేరాలి

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- వెనుకబడిన మండలాలకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక
- రోజువారీ సమీక్షలు.. నిర్లక్ష్యంపై బాధ్యత నిర్ధారణ హెచ్చరిక



మెదక్ బ్యూరో, జులై 27 (జనంసాక్షి): జిల్లాలో స్త్రీ నిధి రుణాల రికవరీని యుద్ధ ప్రాతిపదికన చేపట్టి, వచ్చే రెండు నెలల్లో కనీసం 90 శాతం రికవరీ సాధించేలా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా స్థాయి స్త్రీ నిధి సమీక్ష కమిటీ సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, అడిషనల్ డీఆర్‌డీఓ సరస్వతి, మెప్మా పీడీ హనుమంతరెడ్డితో కలిసి రుణాల రికవరీ, పెండింగ్ బకాయిలు, మండలాల వారీ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. రాష్ట్రంలో స్త్రీ నిధి రికవరీలో జిల్లా 46వ స్థానంలో ఉందని పేర్కొన్న కలెక్టర్, రికవరీ తక్కువగా ఉన్న మండలాలకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని 605 వీవోల ద్వారా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి ఇంటింటికీ వెళ్లి రుణగ్రహీతలకు అవగాహన కల్పిస్తూ వసూళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఏపీఎం లు, మండల సమాఖ్య అధ్యక్షులు ప్రతిరోజూ రికవరీ పురోగతి నివేదికలు సమర్పించాలని, రోజువారీ సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. మెరుగైన పనితీరు కనబరిచిన మండలాలను అభినందిస్తామని, నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారణ చేస్తామని హెచ్చరించారు. మహిళా సంఘాలకు ఆదాయ వనరులు పెంచి, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని అధికారులకు సూచించారు. స్త్రీ నిధి జోనల్ మేనేజర్ టి.వి. రవికుమార్ మాట్లాడుతూ మండలాల వారీగా ప్రత్యేక రికవరీ ప్రణాళికలు అమలు చేసి, అవసరమైతే గ్రామసభలు నిర్వహిస్తూ బకాయిల వసూళ్లపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో స్త్రీ నిధి రీజనల్ మేనేజర్ గంగారం, ఏపీఎంలు, మండల సమాఖ్య అధ్యక్షులు, వీవోలు పాల్గొన్నారు.

## నీటి వనరులను సంరక్షించుకోవాలి

- తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా చర్యలు
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి
- పీఎం ఇంటర్న్‌షిప్ పథకంపై అవగాహన అవసరం
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల నడిగడ్డ, జులై 27(జనంసాక్షి);
ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున ఉన్న నీటి వనరులను సంరక్షించుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ఐడిఓసి సమావేశపు మందిరంలో సోమవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ సమన్వయ సమావేశం, మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో వాటర్, శానిటేషన్ మిషన్ సమీక్ష సమావేశం, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం గురించి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్యలు ఉత్పన్నమవ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. పోలీస్, శిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి బాలల సంరక్షణకు ముందుండాలన్నారు. ఈనెల 29న ఎంపీడీవోలు చైర్మన్ గా తమ మండలాల్లో ఎల్ నినో,జలసిరి,విబిజి రాంజీ,విద్య,తదితర అంశాలపై మండల ప్రజా పరిషత్ సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై నిరుద్యోగ యువతకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ఫలితంగా వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, శిక్షణ సమయంలో స్టైఫండ్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నందున అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పథకానికి సంబంధించిన గోడపత్రికలను పలువురు జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ నర్సింగరావు, అదనపు ఎస్పీ శంకర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రాజ్ కుమార్,డిడబ్ల్యూఓ సునంద,జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, మిషన్ భగీరథ ఈఈ పరమేశ్వరి,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా సమర్పించండి

- అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ

జడ్చర్ల, జులై 27 (జనంసాక్షి): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ – 2026 కార్యక్రమంలో భాగంగా 75- జడ్చర్ల శాసనసభ నియోజకవర్గ ప్రజలు బి.ఎల్.ఓలు తమకు ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను త్వరగా బి.ఎల్.ఓ లకు అందచేయాలని ఎన్నికల నమోదు అధికారి మరియు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జె.ఎల్.బి. హరిప్రియ కోరారు. సోమవారం ఆమె పత్రికా ప్రకటన ద్వారా తెలుపుతూ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు అధికారిక గడువు ఉన్నప్పటికీ, చివరి రోజుల్లో సర్వర్ పై అధిక భారం పడి సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. కాబట్టి ప్రజలు గడువు తేదీ వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా లేదా ముందుగానే తమ ఫారాలను సమర్పించి, తమ విలువైన ఓటు హక్కును పరిరక్షించుకోవాలని ఆమె సూచించారు. జడ్చర్ల నియోజకవర్గంలో ఇప్పటివరకు 92.02 శాతం ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందని తెలిపారు. ఇందులో బాలానగర్ 95.33 శాతం, జడ్చర్ల (అర్బన్) 80.28 శాతం, (రూరల్) 94.33 శాతం మేర పురోగతి సాధించినట్లు వివరించారు. మిగిలిన ప్రక్రియను కూడా వేగవంతం చేసేందుకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, బీఎల్ఓలు, ఆశా వర్కర్లు, అందరూ సమన్వయంతో నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు.

## రైతులకు తప్పని తిప్పలు.. మొబైల్ యాప్ ద్వారా యూరియా బుకింగ్



కోహీర్, జూలై 27 (జనంసాక్షి): వ్యవసాయ రంగం కాలపరిమితిపై ఆధారపడే రంగం కావటంతో యూరి యా ఎరువుల కోసం రైతులు ఇబ్బందు లు ఎదుర్కొంటున్నారు. యూరియాను మొబైల్ యాప్ ద్వారా ముందస్తు బుకిం గ్ చేసుకున్న వారికి మాత్రమే సరఫరా చేస్తున్న నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల నియోజకవర్గంలో 23 గ్రామంలో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలామంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు లేకపోవడం, ఇంటర్నెట్ సౌకర్యం సరిగా అందుబాటులో లేకపోవడం, యాప్ వినియోగంపై అవగాహన లేకపోవడంతో బుకింగ్ చేయలేకపోతున్నారు. దీంతో ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల వద్ద రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. సమయానికి యూరియా అందక పంటలపై ప్రతికూల ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వృద్ధ రైతులు, నిరక్షరాస్యులు యాప్ ద్వారా బుకింగ్ చేయడం మరింత కష్టంగా మారిందని, ఇతరులపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. మొబైల్ యాప్ విధానంతో పాటు ప్రత్యక్ష కౌంటర్‌లో కూడా బుకింగ్, పంపిణీ సౌకర్యాన్ని కల్పించాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ సమస్యను పరిశీలించి, రైతులకు ఇబ్బందులు లేకుండా యూరియా పంపిణీ చేపట్టాలని స్థానిక రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంగరంగ వైభవంగా రుక్మిణి విట్టలేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం..



పెద్ద శంకరంపేట, జూలై 27(జనంసాక్షి): ఆషాఢ మాస ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేట లోని విట్టలేశ్వర దేవాలయంలో సోమవారం రుక్మిణి విఠ లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా వివిధ రకాల పూలతో అలంక రించిన పందిరిలో రుక్మిణి విఠలేశ్వర స్వామి ఉత్సవ విగ్ర హాలకు వైభవంగా కళ్యాణ మహోత్సవం నిర్వహిం చారు. ఉదయం నుండి అధిక సంఖ్యలో మహిళలు భక్తులు స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ బాధ్యులు, అధిక సంఖ్యలో మహిళలు భక్తులు ప్రజలు పాల్గొన్నారు.

## యంగ్ ఇండియా స్కూల్ కోసం కొండపాక ఎమ్మార్వోకు వినతి



కొండపాక, జూలై 27(జనం సాక్షి): సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలో యంగ్ ఇండి యా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అంశం పై కొండపాక మండల యువత ఐక్యంగా ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా గౌరవనీయులైన ఎమ్మార్వో వినతిపత్రం అందజేయడం జరిగింది. కొండపాక మండలానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను వేరే ప్రాంతానికి తరలించే ప్రయత్నం జరిగితే, కొండపాక మండల యువత ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదు. అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు,వంటి ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళనలు చేపడతామని వినతి పత్రంలో తెలియజేశాము. రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్క యువ కుడు, ప్రతి గ్రామ ప్రజలు ఒక్కటై మన కొండపాక హక్కుల కోసం పోరాడా లని పిలుపునిస్తున్నాము.

## మృతుడి కుటుంబానికి రూ.5 వేల ఆర్థికసాయం



హవేలీ ఘన్పూర్, మండలం, జూలై 27 (జనంసాక్షి): హవేలీ ఘన్పూర్ మండలం ముత్తాయిపల్లి గ్రామానికి చెందిన మన్నే గురువు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటన విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియ జేస్తూ రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గ్రామ నాయ కులు డాక్టర్ మోహన్ నాయక్ సేవలను అభినందిస్తూ ఆయనను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీనారాయణ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, భిక్షపతి, రాజు, సురేష్, బాలకృష్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శిఖం కబ్జా చేసిన ఘనుడు మా ఉప సర్పంచ్

- చర్యలు తీసుకోండి అంటూ వినతి

శివ్వంపేట, జూలై 27 (జనంసాక్షి): అధికార గర్వంతో తిమ్మిని బిమ్మిని చేస్తూ, దర్జాగా కుంట శిఖం భూమిని చెర పట్టిన ఘనుడిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ చేస్తూ శివ్వంపేట మండ లం లచ్చిరెడ్డిగూడెం గ్రామస్తులు సోమవారం మండల కేంద్రమైన శివంపేట తాసిల్దార్ కార్యాలయం లోని తహసిల్దార్ కమలాద్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ శివారులోని ఐలాపురంకుంట శిఖంలోని సర్వేనెంబర్ 53 లో ఒక ఎకరం 5 గంటల భూమిని లచ్చిరెడ్డిగూడెం ఉప సర్పంచ్ మాణిక్య రెడ్డి కుంట శిఖాన్ని చదును చేసి, దాని వ్యవసాయ సాగు భూమిగా మార్చి కబ్జాకు పాల్పడ్డాడు. మీరు ప్రజా ప్రతినిధి అయి ఉండి చెరువు భూమిని ఎందుకు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు అడిగితే మమ్మల్ని దూషిస్తూ, మాది అధికార పార్టీ అని మేము ఏది చేస్తే అదే వేదం అవుతుందని భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తంచేస్తూ తాసిల్దార్‌కు మొరపెట్టు కున్నారు. ఉప సర్పంచే ఈ విధంగా చేస్తుండు కాబట్టి ఆయన ఆక్రమించిన ఒక ఎకరం 5 గుంటల శిఖం భూమిని తమరు స్వాధీనం చేసు కొని గ్రామ అవసరాలైన గ్రామ పంచాయతీ భవ నం, స్త్రీ శక్తి భవనం, అంగన్ వాడి కేంద్రం, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి ఈ స్థలాన్ని ఉపయోగించాలని గ్రామస్తులు తాసిల్దార్‌ను కోరా రు. దీనిపై విచారణ జరిపి తగు చర్యలు తీసు



కుంటామని గ్రామస్తులకు తాసిల్దార్ కమలాద్రి హామీ ఇచ్చారు. తాసిల్దార్‌కు వినతిపత్రం అంద జేసిన వారిలో మధు, మహిపాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రాజిరెడ్డి, రవి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## ఆరుతడి పంటలపై రైతులు దృష్టి సారించాలి

- పేట మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ



పెద్ద శంకరంపేట, జూలై 27 (జనంసాక్షి): పెద్ద శంకరం పేట రైతు వేదికలో సోమవారం రోజు విత్తనమేళా కార్యక్రమం నిర్వహించారు. సూపర్ ఎల్‌నినో ప్రభావం వలన ముందు ముందు ఆగస్టు సెప్టెంబర్లలో పంటలకు తీవ్రమైన వర్షాభావ ఆటంకం కలుగుతుంది అనే ఉద్దేశంతోటి వ్యవసాయ శాఖ మరియు కలెక్టర్ ఆదేశానుసారము విత్తనమేళ కార్యక్రమం నిర్వహించారు. వరికి ప్రత్యామ్నాయ పంటలైనటువంటి కందులు, సజ్జలు, రాగులు, కొర్రలు మరియు ఆయిల్ ఫామ్ పై రైతులకు అవగాహనతో పాటు కంది విత్తనాలను రైతులకు సరఫరా చేయడం జరిగింది. అదేవిధంగా రైతులు వర్షపు నీటిని తమ భూములలో ఎప్పటికప్పుడు ఇంకుడు గుంతలు బోర్వెల్ రీఛార్జిలు విధానంపై దృష్టి సారించాలని వివరిచారు. వీలైనంత ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని, అంతర పంటలు మరియు ఒకే దఫాలో రెండు మూడు పంటలు పండించడం పై దృష్టి సారించాలని వివరించడం జరిగింది. ఒకవేళ వరి వేయదలుచుకుంటే వెదజల్లే పద్ధతి, డైరెక్ట్ సీడ్లింగ్ పద్ధతి ద్వారా వరి పండించాలని దీని ద్వారా తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం పొందవచ్చు అని ఆయన తెలిపారు. విత్తనాలు అవసరమున్నవో వ్యవసాయాధికారులను సంప్రదించిన వారికి విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో భుజరంపల్లి సర్పంచ్ జైపాల్ గౌడ్, మక్త లక్ష్మాపూర్ సర్పంచ్ శ్రీనివాస్, పిఎసిఎస్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులు మరియు రైతులు, మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ ఈవోలు అఖిల్ వినీత్ సమరిన్ తదితరులు పాల్గొన్నారు.

## పొలాలకు కరెంటు నిలిపివేత.. రోడ్డెక్కిన రైతులు

- మంత్రి దామోదర్ రాజనర్సింహ జోక్యంతో పునరుద్ధరించిన విద్యుత్ సరఫరా



పుల్కల్,జూలై 27 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల కేంద్రంలోని అంబే ద్కర్ చౌరస్తాలో సింగూరు నది పరివాహక ప్రాంత రైతులు సోమవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. నది నుంచి మోటార్ల ద్వారా తమ పంట పొలాలకు సాగునీరు అందించుకుంటున్న రైతులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నదిలో మోటార్లు బిగించి వాటి ద్వారా పంటలకు నీరు అందిస్తున్నాం. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ నిలిపివేస్తే మధ్యలో మా పంటల పరిస్థితి ఏమిటి, పంటలు ఎండిపోతే బాధ్యత ఎవరిది, అం టూ రైతులు అధికారులను ప్రశ్నిస్తూ నిరసన తెలిపారు. విద్యుత్ సరఫరాను వెంటనే పున రుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డుపై బైఠాయించ దంతో కొంతసేపు రాకపోకలకు అంత రాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న జోగిపేట సీఐ అనిల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.



**మంత్రి ఆదేశాలతో విద్యుత్ పునరుద్ధరణ...**

స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వెంటనే స్పందించారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో ఫోన్‌లో మాట్లాడి గంటల వ్యవధిలోనే సింగూరు నది పరి వాహక ప్రాంత రైతుల పొలాలకు వెళ్లే విద్యుత్ సరఫరాను యథావిధిగా కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సర ఫరాను పునరుద్ధరించడంతో రైతు లు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి దామోదర్ రాజనర్సింహ,జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ముందస్తు సమాచా రం లేకుండా విద్యుత్ సరఫరా నిలిపి వేయకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

# అన్నారం భూములను TGIICకి కేటాయించొద్దు

- జిల్లా కలెక్టర్‌కు రైతులు, గ్రామస్తుల వినతి
- భూములు లాక్కోవద్దని అధికారులను, ప్రజాప్రతినిధులను వేడుకున్న బాధితులు



**గుమ్మడిదల, జూలై 27 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలంలోని అన్నారం గ్రామ సర్వే నంబర్ 261/1లో ఉన్న వ్యవసాయ భూములను తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (TGIIC)కు కేటాయించవద్దని కోరుతూ గ్రామ రైతులు, గ్రామస్తులు సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు.
తరతరాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను పరిశ్రమల పేరుతో స్వాధీనం చేసుకోవద్దని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములపైనే తమ కుటుంబాల జీవనాధారం ఆధారపడి ఉందని, భూములు కోల్పోతే ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు.
ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, సంబంధిత భూములను TGIICకు కేటాయించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. తమకు న్యాయం జరిగే వరకు చట్టబద్ధంగా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు.

## నూతన రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం నాయకులకు ఘన సన్మానం

- ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటును రద్దు చేయాలని డిమాండ్
- బెజ్జంకి బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు



**బెజ్జంకి, జూలై 27,(జనంసాక్షి):** మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్,వివిధ కుల సంఘాలు,బెజ్జంకి మండల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నూతనంగా తెలంగాణ రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం అధ్యక్షుడిగా ఎన్నికైన బుర్ర సురేష్‌కుమార్, జాయింట్ సెక్రటరీగా ఎన్నికైన మహేష్, బెజ్జంకి మండల ఉపసర్పంచుల సంఘం అధ్యక్షుడు దీటి బాలనర్సులకు ఘనంగా సన్మానం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. అనంతరం తిమ్మాయిపల్లి,గుగ్గిళ్ల,పోతారం శివార్లలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీలను తక్షణమే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీల ఏర్పాటుతో ప్రజారోగ్యం, వ్యవసాయం, భూగర్భ జలాలు, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చింతకింది పరశురాములు, గూడెం బాబు, మాంకాళి రాజు, మాంకాళి బాలయ్య, శంకరయ్య,మాంకాళి బాబు, లింగాల బాబు,ఉప్పులేటి బాబు,లింగాల రాజబాబు, రూపేష్, మహేష్, నాగేష్,అర్జున్,కొమురయ్య,తిరుపతి,చీమల బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి కాంగ్రెస్ అండ



**హవేలి ఘనపూర్, మండలం జులై 27, (జనంసాక్షి):** మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం ముత్తాయికోట గ్రామానికి చెందిన ఏలబోయిన శ్యామమ్మ అకాల మరణం చెందడం అత్యంత విషాదకరం. ఈ విషాద ఘటన విషయం తెలుసుకున్న హవేలీ ఘనపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, ముత్తాయికోట గ్రామ సర్పంచ్ గుండారం కిరణ్ గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి వారి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, అంత్యక్రియల నిర్వహణ కోసం రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. గౌరవ మైనంపల్లి హనుమంతరావు గారు, మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ గారి స్ఫూర్తితో ప్రజాసేవలో ముందుండి పనిచేస్తున్న గుండారం కిరణ్ గౌడ్ సేవలను గ్రామస్థులు అభినందించారు. గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని ఆకాంక్షించారు.

## ఫసల్ బీమా యోజన అమలు చేయాలని డిమాండ్: తహశీల్దార్‌కు వినతిపత్రం



**నవాబ్‌పేట, జులై 27(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని వెంటనే అమలు చేసి, రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ నవాబ్‌పేట మండల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాల వల్ల నష్టపోతున్న రైతులకు పంట బీమా ఎంతో ఆసరాగా నిలుస్తుందని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకం అమలులో నిర్లక్ష్యం చేయడం వల్ల రైతాంగం తీవ్రంగా నష్టపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫసల్ బీమా పథకాన్ని అమల్లోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ లోకి రేవు శ్రీనివాస్, మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, జనరల్ సెక్రెటరీ గణేష్ చారి, సీనియర్ నాయకులు పశువుల యాదయ్య, రామకృష్ణ, కూచూర్ చెన్నయ్య, రవి, కేశవపల్లి గణేష్, నర్సింలు, బూత్ అధ్యక్షులు వంగూరు శ్రీను తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పడమటి ఆంజనేయ స్వామి రాజగోపురం పనులను పరిశీలించిన మంత్రి

- నాణ్యతతో పూర్తి చేసి బ్రహ్మోత్సవాల నాటికి అందుబాటులోకి తేవాలి
- అధికారులకు రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశం



**మక్తల్, జూలై 27 (జనంసాక్షి):** మక్తల్ పట్టణంలోని ప్రసిద్ధ శ్రీ పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో రూ. 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న రాజగోపురం నిర్మాణ పనులను రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి సోమవారం పరిశీలించారు. ఆలయ ధర్మకర్త ప్రాణేషాచారితో కలిసి పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి, ప్రాజెక్టు వివరాలను అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మాణ నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి స్పష్టం చేశారు. రాజగోపుర నిర్మాణం భక్తుల ఆకాంక్షలకు అనుగుణంగా, శాస్త్రోక్తంగా, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో జరగాలి. నిర్ణీత గడువులోగా పనులన్నీ పూర్తి చేసి, రాబోయే పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల నాటికి రాజగోపురాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మాగనూర్ మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు వాకిటి హన్మంతు, అంజిలతో పాటు పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

## రాజానెల్లిలో ఘనంగా ఆషాఢ మాస బోనాలు



**కోహీర్, జులై 27 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహీర్ మండల నియోజకవర్గం రాజనెల్లి గ్రామంలో ఆషాఢ మాస బోనాల వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో, అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. డప్పు వాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో శోభాయాత్ర నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు, హారతులు నిర్వహించి, గ్రామంలో పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, అందరికీ సుఖశాంతులు చేకూరాలని ప్రార్థించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉదయం నుంచే ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో విలసిల్లాయి. బోనాలతో వచ్చిన మహిళలతో గ్రామంలోని పురవీధులన్నీ కోలాహలంగా మారాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ పండుగ వాతావరణం గ్రామస్థుల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందించింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అమృతప్ప పాటిల్, ఉప. సర్పంచ్ సీ.భాగ్యమ్మ గ్రామ పెద్దలు పాండరినాథ్ రెడ్డి పాపిరెడ్డి, రఘుమోహన్ రెడ్డి. రాజవర్ధన్ రెడ్డి, మాణిక్యప్ప, విలేజ్ ప్రెసిడెంట్ (గ్రామ అధ్యక్షుడు)పెంటమ్మ -బుజ్జమ్మ, మెంబర్ ఈశ్వరప్ప, రాజుగౌస్ శాంసంగ్. తదితరులు విశేష సంఖ్యలో పాల్గోని ఉత్సవలను దిగ్విజయం చేశారు

## మృతుల కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**బెజ్జంకి,జూలై 27,(జనంసాక్షి):** మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందిన మేడుదుల నర్సయ్య,ఆడుకుని మల్లవ్వ కుటుంబ సభ్యులను, అలాగే గుండారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన అమరాజు శివ కుటుంబ సభ్యులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి,కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, రావుల నర్సయ్య, జెల్ల ప్రభాకర్, నర్సింగరావు, శ్యామ్, వేణు, రమేష్, చంద్రం, గుండారం గ్రామశాఖ అధ్యక్షుడు అమరాజు ప్రశాంత్,పుల్ల పోచయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## ఆపదలో అండగా నిలిచిన యూత్ కాంగ్రెస్ నాయకులు

- రోగికి రక్తదానం చేసి ప్రాణం కాపాడిన యువ నేతలు



**చేర్యాల, జులై 27(జనంసాక్షి):** ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం కాంగ్రెస్ సిద్ధాంతమని యూత్ కాంగ్రెస్ నాయకులు నిరూపించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన పోతుల శ్రీనివాస్ కు ఎమర్జెన్సీ ఆపరేషన్ కు రక్తం అవసరం ఉందని తెలిసిన వెంటనే స్పందించి రక్తదానం చేశారు. వివరాల్లోకి వెళితే.. శ్రీనివాస్ కు అత్యవసరంగా రక్తం కావాలనే సమాచారం అందుకున్న వెంటనే యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, చేర్యాల పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చింతల మల్లేశం లు సోమవారం సిద్దిపేట జిల్లా వంటిమామిడిలోని ఆర్.వీ.ఎం ఆసుపత్రికి వెళ్లి రక్తదానం చేశారు. అంతటితో ఆగకుండా శ్రీనివాస్ కు ఆపరేషన్ అయ్యే వరకు ఆస్పత్రిలోనే ఉండి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా యువ నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం అంటే ఒక నిండు ప్రాణాన్ని కాపాడినట్లే. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి, సమాజంలో మంచి పనులు చేయాలని కోరారు. ఈ ఘటనతో స్థానికంగా కాంగ్రెస్ నాయకుల సేవా భావాన్ని ప్రజలు ప్రశంసించారు.

## నీటిని ఒడిసి పట్టేందుకు ముందుకు రావాలి



**తూప్రాన్, జులై 27(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన  విబిజి రాంజీ పథకంలో భాగంగా మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో జలసిరిపై సోమవారం గ్రామసభ నిర్వహించారు. సూపర్ ఎలినీనో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్నందున రైతులు పంట కుంటలు, బోర్ రీఛార్జ్ ఫీట్స్, పార్కులేషన్ ట్యాక్స్, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా జలసిరిని ఒడిసి పట్టేందుకు రైతులు ముందుకు రావాలని ఈజీఎస్ ఏపీవో సంతోష్ రెడ్డి గ్రామ సభలో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మీనా, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలి

- ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో పరిష్కరించాలి
- ప్రజావాణిలో 99 వినతులు స్వీకరణ..
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి, జూలై 27 (జనంసాక్షి):** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ప్రతి ఫిర్యాదు, వినతిని అత్యంత బాధ్యతతో పరిశీలించి, నిర్దిష్ట రిమార్కులతో సకాలంలో, సమగ్రంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండులతో కలిసి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ప్రజావాణి ద్వారా జిల్లాకు వచ్చిన ఫిర్యాదులతో పాటు జిల్లా ప్రజావాణిలో అందిన వినతులను కూడా సంబంధిత శాఖలు అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును వాస్తవ పరిస్థితుల ఆధారంగా క్షుణ్ణంగా పరిశీలించి, స్పష్టమైన నివేదికలు, నిర్దిష్ట రిమార్కులతో పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు ప్రజావాణిలో మొత్తం 99 వినతులు అందాయి. వాటిలో సంగారెడ్డి డివిజన్‌కు 14, నారాయణఖేడ్ డివిజన్‌కు 5, జహీరాబాద్ డివిజన్‌కు 39, కలెక్టరేట్‌కు 41 వినతులు అందగా, ఆందోల్ డివిజన్‌కు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు.

అందిన వినతులు ప్రధానంగా రెవెన్యూ, ఉద్యానవన, వ్యవసాయం, పెన్షన్లు, ఇంటర్మీడియట్ విద్యాశాఖ, ఎస్సీ సంక్షేమం, బీసీ సంక్షేమం, పంచాయతీ రాజ్, నీటిపారుదల, పోలీసు, రిజిస్ట్రేషన్, కార్మిక, విద్య, ఆర్టీసీ, పౌరసరఫరాలు, మహిళా మరియు శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖలు, పురపాలక సంస్థలకు సంబంధించినవి.

ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంగారెడ్డి ఆర్డీఓ, కలెక్టరేట్ రెవెన్యూ శాఖ అధికారులు, వివిధ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కొండపాక మండలంలో బంద్

- యంగ్ ఇండియా స్కూల్ కోసం రాజీవ్ రహదారిపై ధర్నా




**కొండపాక, జూలై 27 (జనం సాక్షి):** సిద్దిపేట జిల్లా కొండపాక మండల కేంద్రంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ అంశంపై కొండపాక బిఆర్ఎస్ పార్టీ పిలుపుమేరకు కొండపాక మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలలను బంద్ చేయడం జరిగిందని కొండపాక మండలంలో యంగ్ ఇండియా స్కూల్‌ను నిర్మాణం చేపట్టే వరకు నిరసనలు, ధర్నాలు,ర్యాలీలు రాజీవ్ రహదారి దిగ్బంధం చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసిన యంగ్ ఇండియా స్కూల్‌ను పక్క మండలకు తరలించే కుట్రను మేము సహించేది లేదని గతంలో కొండపాక మండలంలో వెటర్నరీ కాలేజీని మంజూరు చేసి తన సొంత నియోజకవర్గం కొడంగల్‌కు తరలించక పోవడం జరిగిందని యంగ్ ఇండియా స్కూల్ కు మంజూరు చేసిన 200 కోట్ల రూపాయల నిర్మాణ పనులు చేపట్టే వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనంతల ప్రశాంత్ నూనె కుమార్, దుర్గయ్య తదితరులు కలిసి మాట్లాడుతూ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ సీనియర్ నాయకులు వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సాఫీగా ప్రయాణం సాగేదెప్పుడో..!



**పాపన్నపేట, జూలై 27 (జనంసాక్షి):** సాఫీగా సాగాల్సిన ప్రయాణం సమస్యల వలయంగా మారింది.! నార్సింగి గ్రామం నుండి పెద్ద శంకరంపేట వెళ్లే రహదారి చాలా కాలంగా గుంతల దారిగా మారింది. వర్ష కాలం వాహన దారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. రహదారి మీదుగా ప్రతిరోజూ నార్సింగి నుండి ఆర్కేల మీదుగా పెద్ద శంకరంపేటకు వివిధ గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిని బాగుచేయాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయమై ర.భ శాఖ ఏఈ రవికుమార్‌ను వివరణ కోరగా.. ఇటీవలే ఈ రహదారికి రూ. 30 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నిర్మాణ పనుల ప్రారంభ ప్రక్రియ కొనసాగుతుందని త్వరలో పనులు చేపడతామన్నారు .

## కేజీబీవీ ఆకస్మిక తనిఖీ

- పలు రికార్డులు, స్టోర్ రూంను పరిశీలించిన అదనపు కలెక్టర్ నగేష్



**రేగోడ్, జూలై27(జనంసాక్షి):** మెదక్ జిల్లా మండల కేంద్రమైన రేగోడు లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంను సోమవారం అడిషనల్ కలెక్టర్ నగేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణను పరిశీలించారు. విద్యార్థినుల హాజరు, తరగతి బోధన, వసతి గదులు, భోజన నాణ్యత, పారిశుద్ధ్యం తదితర అంశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.లోపాలు ఉన్న చోట వెంటనే సరిదిద్దాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థుల సౌకర్యార్థం కోసం నిర్మిస్తున్న అదనపు గదులు త్వరితగతిన పూర్తి చేయించాలని కళాశాల ప్రిన్సిపాల్ స్వయంప్రభ అడిషనల్ కలెక్టర్ ను కోరగా సానుకూలంగా స్పందించి పూర్తిచేయిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దత్తారెడ్డి,ఆర్ ఐ శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్య ప్రణాళికపై పట్టు సాధించాలి: ఎంఈవో



**పాపన్నపేట, జూలై 27 (జనంసాక్షి):** ప్రభుత్వ బడిలో విద్యార్థులకు ఆధునిక పద్ధతిలో అర్థమయ్యే విధంగా ఉపాధ్యాయులు బోధించాలని మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని ఎంఈవో ప్రారంభించి మాట్లాడారు. పాఠ్య ప్రణాళిక పై పట్టు సాధించాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు, ఆరోగ్యం,భుజాత,ఎస్జీటీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ కళాభవన నిర్మాణానికి కోటి 90 లక్షల మంజూరు

- మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి
- హర్షం వ్యక్తం చేసిన మిడ్జిల్ దళిత సంఘాల నాయకులు



**మిడ్జిల్, జూలై 26(జనంసాక్షి):** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ రచయిత దళిత వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకుడు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళాభవన్ నిర్మాణానికి మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య కృషితో ఒక కోటి 90 లక్షల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేయడం పట్ల మిడ్జిల్ గ్రామ ప్రజలతో పాటు వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి పట్టుదలతో కోటి 90 లక్షల రూపాయలు కళాభవన నిర్మాణానికి ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేసినందుకు మిడ్జిల్ దళిత నాయకులు. వివిధ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కళాభవనానికి ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మాట ఇచ్చిన సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం నిధులు మంజూరు చేశారని మిడ్జిల్ మాజీ సర్పంచ్ శారద వెంకటయ్య ఆనందం వ్యక్తం చేశారు. అంబేద్కర్ విజ్ఞాన సేవా సమితి.విగ్రహ కమిటీ అధ్యక్షునిగా ఉన్న సందర్భంగా నిధులు మంజూరు కావడం సంతోషంగా ఉందని అన్నారు. ఎమ్మెల్యే సహకారంతో మునుముందు మిడ్జిల్ మండల కేంద్రంలోని మరెన్నో అభివృద్ధి పనులు చేపట్టి నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తోటి అనేకసార్లు సంప్రదింపులు జరపడంతో స్థానిక ఎమ్మెల్యే పట్టుదలగా ప్రభుత్వ నాయకులతో మాట్లాడి నిధులు మంజూరు చేశారని ఇలాంటి నాయకుడు దొరకడం మిడ్జిల్ ప్రజలు చేసుకున్న అదృష్టమని అన్నారు.

## అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సహాయం

**పుల్కల్,జూలై 27 (జనంసాక్షి):** మండల కేంద్రానికి చెందిన పోచన్నగారి జైలు అనారోగ్యంతో మృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి మృతి చెందిన వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్రామంలో ఎటువంటి శుభ, అశుభ కార్యక్రమం జరిగినా ప్రజలకు అండగా నిలుస్తున్న సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి తన పెద్ద మనసును మరోసారి చాటుకున్నారు.మృతి చెందిన పోచన్నగారి జైలు కుటుంబానికి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు.సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ చారి, మంగలి ప్రభాకర్, ఏసురత్నం, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలి



**జడ్చర్ల, జూలై 27 (జనంసాక్షి):** ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి భూగర్భ జలాలు పడిపోతున్న నేపథ్యంలో, వరి సాగు విస్తీర్ణాన్ని తగ్గించుకోవాలని, ప్రత్యామ్నాయంగా మినుములు, ఆముదం, పెసర్లు, కందులు, నువ్వులు, పొద్దుతిరుగుడు మరియు కూరగాయల సాగు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ నాయక్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్ కోరారు. జడ్చర్ల మండలంలోని గంగాపూర్ రైతు వేదికలో సోమవారం విత్తన మేళాను ప్రారంభించారు. జూలై 27 నుంచి 29 వరకు ఈ మేళా కొనసాగునట్లు తెలిపారు. మేళాలో భాగంగా రైతులకు ఆముదం, కంది, మినుములు మరియు కూరగాయల విత్తనాలను అందుబాటులో ఉంచినట్లు అధికారులు వెల్లడించారు. సంప్రదాయ పంటలతో పాటు ఉద్యాన పంటలైన ఆయిల్ పామ్ సాగును కూడా భారీగా పెంచాల్సిన అవసరం ఉందని ఉద్యాన శాఖ అధికారి తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తే నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల సహాయ వ్యవసాయ సంచాలకులు విజయ నిర్మల, స్థానిక వ్యవసాయ అధికారి బి. గోపీనాథ్, శాస్త్రవేత్త డా. కళ్యాణి, బాదేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అల్వాల్ జ్యోతి రెడ్డి, వైస్ చైర్మన్ రాజు, గంగాపూర్ సర్పంచ్ బండ గిరి ప్రసాద్, మాజీ సర్పంచ్ గోపాల్, ఉప సర్పంచ్ రవి, జనార్దన్ రెడ్డి, మల్లికార్జున్, మండలంలోని విస్తరణ అధికారులు మరియు వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

# తేనెటీగలు పుట్టగొడుగుల పెంపకంతో అధిక లాభం

- రైతులు పారిశ్రామికవేత్తగా మారాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**కౌడిపల్లి, జూలై 27 (జనంసాక్షి):** సోమవారం తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకం పై రైతులకు కౌడిపల్లి మండల కేంద్రం లోని రైతు మహిపాల్ రెడ్డి, వ్యవసాయ క్షేత్రం లో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సు సమావేశంలో ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్, డిఆర్డిఓ శ్రీనివాసరావు, రైతులు ప్రజాప్రతినిధులతో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖల ఆధ్వర్యంలో రైతులు - యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తేనెటీగల, పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో అదనపు ఆదాయాన్ని, ఆర్థిక భద్రతను అందించే ముఖ్యమైన వ్యవసాయాధారిత, ఉద్యాన అనుబంధ రంగాలుగా చెప్పుకోవచ్చు అన్నారు. నిరుద్యోగ



యువత, మహిళలు, రైతులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి అవకాశాలు కల్పించబడతాయి అన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా సబ్సిడీలు, శాస్త్రీయ పద్ధతిలో శిక్షణా కార్యక్రమాల ఏర్పాటు చేస్తున్నట్లు అదనపు ఆదాయం పెంపొందించే విధంగా తేనె, పుట్టగొడుగుల ఉత్పత్తులకు మార్కెట్‌లో పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని యూనిట్ల ఏర్పాటు చేసుకోవాలన్నారు.
అనంతరం నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, మాట్లాడుతూ... తక్కువ



పెట్టుబడితో కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల సాగు. తేనెటీగల పెంపకం ద్వారా అదనపు ఆదాయ వనరులు. సమకూరుతాయన్నారు. ఉద్యాన వన, పట్టు పరిశ్రమ శాఖల ద్వారా అందే సబ్సిడీలు, శిక్షణ వివరాలు. సద్వినియోగం చేసుకుని లబ్ది పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు కౌడిపల్లి సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, కౌడిపల్లి బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సారా రామ గౌడ్‌తో పాటు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు రైతులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరు తడి పంటలే
# సాగు చేయాలి... అందరికీ ఆదర్శంగా నిలవాలి



**శివ్వంపేట, జూలై 27(జనంసాక్షి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి 29వ తేదీ వరకు విత్తనమేళకు శ్రీకారం చుట్టారని మండల వ్యవసాయ శాఖ అధికారి లావణ్య తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన శివ్వంపేట అలాగే మండల పరిధిలోని దొంతి రైతు వేదికల్లో విత్తన మేళా ను ఏర్పాటు చేశారు. తక్కువ నీరు - ఎక్కువ లాభం అనే నినాదంతో రైతులు ప్రత్యా మ్నాయ పంటలు సాగుచేయాలని ఆమె సూచించారు. రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేస్తే వర్షాభావ పరిస్థితుల్లోనూ పంట నష్టపోకుండా ఆర్థికంగా లాభపడవచ్చునన్నారు. ఈ మేళాలో అందుబాటులో ఉండే నాణ్యమైన విత్తనాలు కంది, ఆముదము, మక్కజొన్న, కూరగాయలు, బెండ, బీర, పలు ఆకు కూరల విత్తనాలు ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు, డీలర్లు బాసంపల్లి స్వామిగౌడ్, బోట్టు వెంకటేష్, కిషోర్ గౌడ్, చిన్నయ్య యాదవ్ లతో పాటు పలు గ్రామాల రైతులు ఉన్నారు.

# కోహిర్ రైతువేదికలో విత్తన మేళా

- తక్కువ నీటితో పండే పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి
- వ్యవసాయ సంచాలకులు భిక్షపతి



**కోహిర్, జులై 27 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం విత్తన మేళా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ విత్తన మేళా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాఖ సంచాలకులు భిక్షపతి హాజరయ్యారు. ?కార్యక్రమంలో భాగంగా స్థానిక రైతులకు వివిధ రకాల నాణ్యమైన విత్తనాల ప్యాకెట్లను ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ. మారుతున్న వాతావరణ పరిస్థితులపై రైతులు అవగాహన పెంచుకోవాలని. పిలుపునిచ్చారు. ?ముఖ్యంగా 'ఎల్ నినో' ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో వర్షభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం. ఉందని. హెచ్చరించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని సూచించారు. ?తక్కువ కాలపరిమితి, తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ దిగుబడినిచ్చే పంటలు వేయడం ద్వారా నష్టాల నుండి బయటపడవచ్చని తెలిపారు. సాంప్రదాయ పంటలకంటే ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలని ఆయన కోరారు. నీటి యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా లభ్యమయ్యే నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని చెప్పారు. రైతులకు అవసరమైన సలహాలు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ పంట మార్పిడి పద్ధతులను ఆచరించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విత్తన మేళా ఏర్పాటు ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలపై పూర్తి అవగాహన కల్పించారు. విత్తన మేళాలో ప్రదర్శించిన వివిధ రకాల పంట విత్తనాలను రైతులు ఆసక్తిగా తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ అధికారులు, నవీన్. ఏ. ఇ ఓ. ప్రశాంత్. ఏ. ఇ. ఓ. స్వాతి ఏఇఓసవిత సిబ్బంది, కార్యక్రమానికి మండల పరిధిలోని పలు గ్రామాల నుండి వచ్చిన రైతులు పాల్గొన్నారు.

# ఐఐటీలో సీటు సాధించిన నిరుపేద రైతు కుమారుడు

- గట్టులింగంపల్లి గ్రామంలో సంబరాలు.. ఘనంగా సన్మానించిన గ్రామస్థులు



**నారాయణఖేడ్, మనూర్ 27, (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని మనూరు మండలం గట్టులింగంపల్లి గ్రామానికి చెందిన నిరుపేద రైతు కుటుంబానికి చెందిన అభిలాష్ రావు ప్రతిష్ఠాత్మక భారతీయ సాంకేతిక విద్యాసంస్థ (ఐఐటీ)లో సీటు సాధించి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. సన్నకారు రైతు మారుతిరావు కుమారుడైన అభిలాష్ రావుకు కర్ణాటక రాష్ట్రంలోని ధార్వాడ్ ఐఐటీలో ప్రవేశం లభించడంతో కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. తమ కుమారుడు ఐఐటీలో సీటు సాధించడం తమ కుటుంబానికి ఎంతో గర్వకారణమని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. అభిలాష్ రావు సాధించిన ఈ విజయం గట్టులింగంపల్లి గ్రామానికే కాకుండా నారాయణఖేడ్ నియోజక వర్గానికి గర్వకారణంగా నిలిచింది.

# ఎక్కమేడ్‌లో గ్రామసభ



**కొత్తపల్లి, జూలై 27 (జనంసాక్షి):** సోమవారం రోజు ఎక్కమేడ్ గ్రామ పంచాయితీ కార్యాలయం దగ్గర సర్పంచ్ వి.మౌనిక తండ్రి రాజు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ మరియు వ్యవసాయ జీవన దారం, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకోవాలి, అలాగే పారం పండు రైతులు పొలాలలో పెట్టుకోవాలి. అలాగే ఇందిరమ్మ ఇల్లు ఎల్ 1 లిస్టులో ఉన్న పేరు పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల అధికారి కొండన్న, పంచాయితీ కార్యదర్శి, గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వివో, అంగన్వాడి టీచర్, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశ వర్కర్, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, గ్రామ యువత అందరూ పాల్గొనడం జరిగింది.

## కల్వకుర్తిలో
# మాదిగ ఉద్యమ సంఘాల జిల్లా సదస్సు

- కొత్త కమిటీల ఏర్పాటుపై చర్చ
- గ్రామస్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపు



**కల్వకుర్తి, జూలై 27(జనంసాక్షి):** మాదిగ ఉద్యమ సంఘాలు, అనుబంధ సంఘాల నూతన నిర్మాణానికి సంబంధించి కల్వకుర్తిలో సోమవారం జిల్లా సదస్సు నిర్వహించారు. జిల్లా ఇంచార్జులు అడెపు నాగార్జున మాదిగ, మద్దిలేటి మాదిగ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుడిగానిపల్లి రాజు మాదిగ, జిల్లా అధ్యక్షుడు కరిగేళ్ల దశరథం మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు అడెల్లి అంజి మాదిగ, కల్వకుర్తి మండల ఇంచార్జి పర్వపాకుల శేఖర్ మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి సిద్దులు మాదిగతో పాటు గూట విజయ్ మాదిగ, పరమేష్ మాదిగ, రాముడు మాదిగ, కుర్మయ్య మాదిగ, చంటి మాదిగ, భగవంత్ మాదిగ, బాలన్న మాదిగ, రాధాకృష్ణ మాదిగ, నాగన్న మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ విద్యార్థుల
# మృతులపై సీపీఐ కొవ్వొత్తుల ర్యాలీ

- విద్యా వ్యవస్థలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్




**వనపర్తి రూరల్, జూలై 27, (జనంసాక్షి):** నీట్ పరీక్షలకు సంబంధించి విద్యార్థుల మరణాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌక్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించాలని, ఉద్యమాల్లో పాల్గొన్న విద్యార్థులు, యువకులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో సమగ్ర సంస్కరణలు చేపట్టి విద్యార్థులపై మానసిక ఒత్తిడి తగ్గించే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కళావతమ్మ, కృష్ణవేణి, జయమ్మ, గంధం నాగరాజు, చిన్న కుర్మన్న, బాలేమియా, లక్ష్మీనారాయణ, సురేష్, మల్లెపు నరసింహ, చందు, మంద సురేష్, శివ, వంశి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

## తాడూరు-ఆచంపేట
# రహదారిపై పోలీసుల విస్తృత తనిఖీలు

- డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరు పట్టివేత.. రెండు కేసులు నమోదు



**ఉప్పునుంతల, జూలై 27 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాదాల నివారణకు ఉప్పునుంతల పోలీసులు ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. తాడూరు-ఆచంపేట ప్రధాన రహదారిపై ఎస్సై పుట్ట మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరిని గుర్తించి వారిపై రెండు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై పుట్ట మహేష్ హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించిన తర్వాత వాహనాలు నడపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడడమే ఇటువంటి ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.

## ప్రజావాణి సమస్యలను పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ నగేష్



**మెదక్ బ్యూరో, జూలై 27 (జనంసాక్షి):** ప్రజావాణి సమస్యలను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. నేటి ప్రజావాణి కార్యక్రమంలో భూభారతి 37, పెన్షన్లు 4, ఇందిరమ్మ ఇండ్లు 7, ఇతర 34 మొత్తం 82 దరఖాస్తులు రావడం జరిగింది. ఈ సందర్భంగా అధికారులందరూ ప్రజావాణి దరఖాస్తులను తక్షణమే పరిశీలన చేసి,పరిష్కరించలన్నారు.

## శిశువు వైద్యానికి ఎల్ఓసి అందజేత



**నిజాంపేట, జులై 27 (జనంసాక్షి):** అనారోగ్య సమస్యతో బాధపడుతున్న శిశువు వైద్యానికి ఎల్ఓసి అందజేశారు. నిజాంపేట మండలం నస్కల్ గ్రామానికి చెందిన చిట్ల రాజయ్య కుమార్తె కుమారుడు శివాంగ్ ఆరోగ్యరీత్యా మెరుగైన వైద్యం నిమిత్తం మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు సహకారంతో 2.50 లక్షల ఎల్ఓసి చెక్కును అందజేశారు. ఎల్వోసికి సహకరించిన ఎమ్మెల్యేకు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందగోకుల్ సర్పంచ్ భాను ప్రకాష్, నాయకులు నసీరుద్దీన్, మద్దికుంట శ్రీను, మ్యాదరి నర్సింలు, కుమార్ , అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## గండీడ్ మండలానికి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, అభివృద్ధికి వరాల జల్లు..

- లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మిచెక్కులు పంపిణీ
- 70 లక్షలతో,గురుకుల విద్యార్థులకు భోజనశాలకు శంకుస్థాపన
- 20 లక్షల నూతన అంచన్ పల్లి గ్రామ పంచాయతీ భవన ప్రారంభం



**గండీడ్, జులై 26(జనంసాక్షి):** పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గండేడ్ మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆదివారంనాడు గండీడ్ మండలంలోని ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి పథకాల లబ్ధిదారులకు మంజూరు చెక్కులను పంపిణీ చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను అందజేశారు. అనంతరం గండేడ్ మండల కేంద్రంలోని గురుకుల విద్యాలయంలో రూ.70 లక్షల వ్యయంతో నిర్మించనున్న విద్యార్థుల భోజనశాలకు భూమిపూజ నిర్వహించారు.అలాగే అంచన్‌పల్లి గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ,మండలంలోని ప్రతి గ్రామం,ప్రతి తండాకు రూ.20లక్షలతో బీటీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు రూ.10లక్షలతో నూతన భవనాలు నిర్మిస్తామని తెలిపారు. అదేవిధంగా ప్రతి గ్రామ అభివృద్ధికి రూ.50 లక్షల నుంచి రూ.70లక్షల వరకు నిధులు కేటాయించి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు,అనంత లక్ష్మారెడ్డి,మాజీ అధ్యక్షుడు జితేందర్ రెడ్డి,ఉమ్మడి గండీడ్ మండలం పిఎసిఎస్,చైర్మన్ కమతం శ్రీనివాస్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతి చెందిన విద్యార్థులకు రూ. కోటి పరిహారం ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్
- నీట్ పేపర్ లీక్‌తో మృతి చెందిన విద్యార్థులకు సీపీఐ నివాళి



**చేర్యాల, జులై 27 (జనంసాక్షి) :** నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులకు నివాళులు అర్పిస్తూ సోమవారం సాయంత్రం చేర్యాల మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో షాదీఖాన నుంచి పలు వీధుల్లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా 21 మంది విద్యార్థులు చనిపోయారని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ప్రజా ఉద్యమ విజయం అని అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం విద్యార్థుల ఉద్యమం, ప్రజాస్వామ్యం గెలిచినట్లేనని అశోక్ అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై ఆందోళనలకు తలొగ్గినట్లు స్పష్టమవుతుందన్నారు. నీట్ పేపర్ లీకేజీ కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని, ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జీ చేసిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్షను రద్దు చేసి, ఆయా రాష్ట్రాలు తమ సొంత ప్రవేశ పరీక్షలు నిర్వహించుకునే అవకాశం కల్పించాలన్నారు. దేశంలోని విద్యావ్యవస్థను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈరి భూమయ్య, మండల కోశాధికారి నంగి కనకయ్య, మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలు సుంకోజు రజిత, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గూడెపు సుదర్శన్, మండల కార్యవర్గ సభ్యులు బండారి సిద్ధులు, జహులామద్దిన్, రాజు, మల్లేశం, పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు సమీక్ష సమావేశం



**మద్దూరు, జూలై 27 (జనంసాక్షి):** మద్దూరు మున్సిపాలిటీ కార్యాలయంలో సర్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించుటకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి డిల్లికర్ సరస్వతి జనార్దన్, మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ సమావేశాన్ని నిర్వహించి సర్ కార్యక్రమం అమలుపై సమగ్రంగా సమీక్షించారు. సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా నిర్వహించడం, అర్హులైన ప్రతి ఓటరు ని గుర్తించి నమోదు చేయడం, వివరాల సవరణలు, మార్పులు, చేర్పులను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడం, ఇంటింటి సర్వే నిర్వహించి ఎటువంటి అర్హులైన ఓటరు మిగలకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, బిఎల్ఓలు పరస్పర సమన్వయంతో పనిచేసి సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## వీబీజీరామ్‌జీ కార్యక్రమంలో ఇంటింటికి ఆరు మొక్కల పంపిణీ

**ఉప్పునుంతల, జూలై 27 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిధిలోని దేవదారికుంట తండా గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో వీబీజీరామ్‌జీ కార్యక్రమంలో భాగంగా సోమవారం గ్రామంలోని ప్రతి ఇంటికి ఆరు మొక్కల చొప్పున పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ శ్రీమతి మంగమ్మ తెలిపారు. ప్రజలు పంపిణీ చేసిన మొక్కలను నాటి సంరక్షించి హరితహారం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ శ్రీమతి సభావత్ మంగమ్మ, గ్రామ పెద్దలు, యువకులు, మహిళా సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవంలో ప్రజలకు మొక్కల పంపిణీ

**ఉప్పునుంతల, జూలై 27 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ చింతగాళ్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు కట్ట అనంత రెడ్డి మాట్లాడుతూ, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి కుటుంబం కనీసం కొన్ని మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ శైలజ--వెంకటయ్య, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు మెడమోని భాస్కర్, కట్ట శ్రీనివాస్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ఆలూరు శ్రీనివాసులు, బొల్లె లక్ష్మయ్య, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య, నిరంజన్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## షెటర్ ఎత్తి దొంగతనం



**కృష్ణ, జూలై 27 (జనంసాక్షి):** కృష్ణ మండలం హిందూపూర్ శివారులోని, టై రోడ్ లిఫ్ట్ దగ్గర తన పొలంలో రోడ్ పక్కన షెట్టర్ నిర్మించి నడుపుతున్న శ్రీ మహాలక్ష్మి చిన్న హోటల్లో ఆదివారం అర్ధరాత్రి షెటర్ లను ఎత్తి దొంగలు, దొంగతనానికి పాల్పడ్డారు. హోటల్ యజమాని హిందుపూర్ ఉప్పర్ కుంటు కాశప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఒక గ్యాస్ సిలిండర్, ఒక పొయ్యి, 30 సంచుల యూరియా బ్యాగులు, కిరాణం షాప్ లో 4 వేల రూపాయలు, విలువగల వస్తువులు,16 లీటర్లు పెట్రోల్, దొంగతనం జరిగినట్లు బాధితులు తెలిపారు. సోమవారం పిఎస్, స్టేషన్ కి వెళ్లి ఫిర్యాదు చేశానని తెలిపారు.ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పెబ్బేరు పాలిటెక్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ నియామకాలపై విచారణకు డిమాండ్

**పెబ్బేరు, జూలై 27 (జనంసాక్షి):** పెబ్బేరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన గెస్ట్ లెక్చరర్ నియామక ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. అభ్యర్థుల వాదన ప్రకారం, మెరిట్ జాబితాను పాటించకుండా, తక్కువ మెరిట్ ఉన్న అభ్యర్థికి నియామకం కల్పించారని, ఇందుకు కళాశాల ప్రిన్సిపాల్ బంధుత్వాన్ని పరిగణనలోకి తీసుకున్నారని ఆరోపిస్తున్నారు.

ఈ కారణంగా మెరిట్ ఆధారంగా ఎంపిక కావాల్సిన అర్హులైన అభ్యర్థులు అన్యాయానికి గురయ్యారని వారు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, నియామక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయడంతో పాటు, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ప్రతి ఒక్కరు ఓటును సురక్షితం చేసుకోవాలి

- బిజెపి బిఎల్ఓలు సహకరించాలి
- బిజెపి రాష్ట్ర నేత నాగురావు నామాజీ



**నారాయణపేట జూలై 27(జనంసాక్షి):** ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో బిజెపి నిర్వహిస్తున్న సంపర్క అభియాన్ లో భాగంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత, రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ 24 గంటల పాటు మరికల్ మండలంలో పర్యటించా రు.ఈ సందర్భంగా మాద్వార్ గ్రామం లోని ఓ నిరుపేద బిజెపి కార్యకర్త ఇంట్లో ఆత్మీయంగా భోజనం చేసి, అదే ఇంట్లో బస చేశారు. అనంతరం కార్యక ర్తలతో సమావేశమై సర్ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రాము ఖ్యత, ప్రతి అర్హుడైన ఓట రు పేరును జాబితాలో నమోదు చేయించడం, తప్పులను సరిదిద్దడం, ప్రతి బూత్‌లో పార్టీ కార్య కర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన విధానం గురించి దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యద ర్శి తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షులు వేణుగోపాల్, మాజీ మండల అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, మండల నాయకులు రాజేష్ యాదవ్, వద్దే శ్రీరామ్, మాధవరం ఉప సర్పంచ్ భీమన్న, మాజీ ఎంపిటిసి ఆంజనేయులు, సీమ శివకుమార్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు..

## వచ్చే నెల 3లోగా సర్ 100 శాతం పూర్తికావాలి

- తహసీల్దార్ కమలాద్రి



శివ్వంపేట, జూలై 27 (జనంసాక్షి): వచ్చేనెల 3వ తేదీ లోగా ఓటర్స్ సవరణ (సర్) 100 శాతం సంపూర్ణం చేయాలని స్థానిక తహసీల్దార్ కమలాద్రి పేర్కొన్నారు. మండల కేంద్ర మైన శివంపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని గ్రామాలకు చెందిన జీపీఓలు, రూట్ సూపర్వైజర్లతో సోమవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 96 శాతం ఓటర్ ప్రక్షాళన పూర్తి అయ్యిందని రాబోయే ఐదు రోజుల లోగా మొత్తం పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. అదేవిధంగా రెవెన్యూ సదస్సుల సందర్భంగా వచ్చిన దరఖాస్తులు పున పరిశీలన గావించి పెండింగ్ లేకుండా భూ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సర్టిఫికెట్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటి కప్పుడు వెరిఫికేషన్ చేస్తూ, త్వరితగతిన సర్టిఫికెట్లను జారీ చేయాలని తహసీల్దార్ హితబోధ చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఉప తహసీల్దార్ బషీర్, ఆర్ఐలు నిరంజన్, కవిత, ఏఎస్ఓ చంద్రరేఖ, జీపీఓలు యాదగిరి, షాదుల్లా, నరేష్, సిద్దిరాములు, జగన్ తదితరులు ఉన్నారు.

## జడ్‌పీహెచ్ఎస్ పాఠశాల పరిసరాల్లో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం



చౌట్కూర్, జూలై 27 (జనంసాక్షి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జడ్‌పీహెచ్ఎస్ వెలుపల సోమవారం ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పార్కుల రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల బయట పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించి, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా మొరం వేయించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీ సుభాష్‌రెడ్డి సహకారం అందించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులకు మెరుగైన వాతావరణం కల్పించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు అనురాధ, ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, వినయ్, కాంగ్రెస్ నాయకులు రమేష్, రాజేశ్వర్ గౌడ్, కరుణాకర్, వార్డు సభ్యులు అశోక్, చక్రపాణి, గంగారాం తదితరులు పాల్గొన్నారు. గ్రామస్థులు కూడా కార్యక్రమాన్ని అభినందిస్తూ పరిశుభ్రతకు సహకరిస్తామని తెలిపారు.

# బాలికను వేధించిన యువకుడికి ఏడాది జైలు

### లవ్ లెటర్ రాసి, బెదిరింపులకు పాల్పడిన కేసులో రూ.20 వేల జరిమానా విధింపు: జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు



మెదక్ బ్యూరో, జూలై 27, (జనంసాక్షి): ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికను వెంటపడుతూ ప్రేమ పేరుతో వేధించి, అనంతరం ఆమె కుటుంబ సభ్యులను బెదిరించిన కేసులో నిందితుడికి ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. శివంపేట పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన చాకలి కుమార్ (21), టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలికను తరచూ వెంటపడేవాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానంటూ ప్రేమలేఖ రాసి, తన స్నేహితుడు మహేష్ ద్వారా అందజేయడానికి ప్రయత్నించాడు. ఈ విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గ్రామ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పెద్దలు ప్రశ్నించగా, లేఖ తానే రాసినట్లు కుమార్ అంగీకరించాడు. దీంతో మనస్తాపానికి గురైన కుమార్ 2023 ఫిబ్రవరి 19న బాలిక తల్లిదండ్రులను అసభ్య పదజాలంతో దూషించి, చంపేస్తానంటూ బెదిరించడంతో బాధిత కుటుంబం శివంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

అప్పటి ఎస్ఐ, దర్యాప్తు అధికారి రవికాంత్‌రావు కేసు నమోదు చేసి, సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రభుత్వ న్యాయవాది బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభా వాలి నిందితుడు చాకలి కుమార్‌కు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ కేసు విచారణలో ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ ఆనంద్, భరోసా లీగల్ అడ్వైజర్ శ్వేతా సమన్వయంతో పనిచేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు నాణ్యమైన విత్తనాలు

- మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి



కొల్చారం, జూలై 27 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి సాగును తగ్గించి, ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నాణ్యమైన విత్తనాల విక్రయాలను చేపట్టిందని మండల వ్యవసాయ అధికారి తెలిపారు. ఇందులో భాగంగా జూలై 27 నుంచి 29వ తేదీ వరకు మండలంలోని వివిధ ప్రాంతాల్లో విత్తనాల విక్రయాలు నిర్వహించనున్నారు. ఈ నెల 28న రంగంపేట పీఏసీఎస్ వద్ద, 29న ఏనగండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో విత్తనాల విక్రయాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కోరారు.

## సాంక్షన్ అయింది.. రోడ్డు మాత్రం కనిపించలేదు!

- రోడ్డు కోసం తండావాసుల ఎదురుచూపులు
- అంబులెన్స్ కూడా రాని దుస్థితి... సంగాయిపేట తాండవాసుల ఆవేదన...
- రోడ్డు లేక తాండవాసుల అవస్థలు... కలెక్టర్ ను ఆశ్రయించిన ప్రజలు
- ఆరేళ్లుగా మారని పరిస్థితి... ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు



కొల్చారం, జూలై 27 (జనంసాక్షి): మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయి పేట గ్రామ పరిధిలోని తండా వాసులు గత కొన్నేళ్లుగా రహదారి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 2022లో తండాకు రోడ్డు మంజూరైనప్పటికీ ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తండాలోని పాఠశాలకు వెళ్లే ఉపాధ్యాయులు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 108కు ఫోన్ చేసినా రోడ్డు సౌకర్యం లేక అంబులెన్స్ తండాకు చేరుకోలేని దుస్థితి నెలకొంది. గతంలో రోడ్డు కాంట్రాక్టర్‌ను సంప్రదించినా స్పందించలేదని తండావాసులు తెలిపారు. రహదారి సమస్య పరిష్కారం కోసం ఆర్అండ్‌బీ ఈఈతో పాటు సిద్దిపేట ఎస్ఈ, హైదరాబాద్ సీఈలను సంప్రదించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు. ఆరేళ్లుగా రోడ్డు పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంగాయిపేట తండా రహదారి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు తండావాసులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సంగాయిపేట సర్పంచ్ పుర్రె కాంత ప్రభాకర్, మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తిలో ఫుట్‌పాత్ కబ్జాలతో ప్రజల ప్రాణాలకు ముప్పు

- నిర్లక్ష్యపు నీడలో సంబంధిత అధికారులు... ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా?
- పాదచారులకు చోటు లేదు... వ్యాపారాలకే ఫుట్‌పాత్‌లు!
- రోడ్లే పార్కింగ్ స్థలాలు... ట్రాఫిక్‌తో నిత్యం నరకయాతన
- ప్రమాదాలు జరుగుతున్నా చర్యలు ఎప్పుడు?.. ప్రజల్లో ఆగ్రహం

కల్వకుర్తి,జూలై 27,(జనంసాక్షి): కల్వకుర్తి పట్టణంలో ప్రజల భద్రత కంటే ఆక్రమణలకే ప్రాధాన్యం లభిస్తున్నదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ప్రస్తుతం వ్యాపార విస్తరణకు నిలయాలుగా మారగా, రహదారులు వాహనాల పార్కింగ్ స్థలాలుగా మారిపోయాయి. దీంతో నడవడానికి దారి లేక ప్రజలు నేరుగా రోడ్డుపైనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. బస్టాండ్, మార్కెట్, ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలల పరిసరాలు, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. రహదారులపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపివేయ డంతో గంటల తరబడి ట్రాఫిక్ స్తంభిస్తోంది. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు సైతం ఇబ్బందులు పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఫుట్‌పాత్‌లపై దుకాణాల విస్తరణ, తాత్కాలిక వ్యాపారాలు, ప్రకటన బోర్డులు, ఇతర ఆక్రమణలతో పాదచారులకు మార్గమే లేకుండా పోయింది. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రహదారులపై నడవాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు పలుమార్లు ఫిర్యాదులు చేసినా సమస్య మాత్రం అలాగే కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ, అక్రమ పార్కింగ్ నియంత్రణలో సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.



"ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కాదు... ప్రమాదం జరగకుండా ముందే చర్యలు తీసుకోవడం అధికారుల బాధ్యత" అని పట్టణ ప్రజలు స్పష్టం చేస్తున్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమణల నుంచి వెంటనే విముక్తి చేయడం, రహదారులపై అక్రమ పార్కింగ్‌ను నియంత్రించడం, నో-పార్కింగ్ నిబంధనలను కఠినంగా అమలు చేయడం, ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఈ పరిస్థితిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి సమగ్ర కార్యాచరణ చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. లేకపోతే రాబోయే రోజుల్లో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రరూపం దాల్చి ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.



## వనమహోత్సవం సందర్భంగా మొక్కల పంపిణీ

- సర్పంచ్ బెక్కెర సునీత రాజశేఖర్ రెడ్డి



ఊర్కొండ, జూలై 27 (జనంసాక్షి); ప్రకృతి పరిరక్షణ, పచ్చని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఇప్ప పహాడ్ సర్పంచ్ బెక్కర సునీత రాజశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా సోమవారం రోజు గ్రామాన్ని పచ్చదనంతో కళకళలాడించే లక్ష్యంతో ఇంటింటికీ మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి పండ్లు,నీడనిచ్చే మొక్కలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి విరివిగా మొక్కలు నాటాలని కోరారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, వాటికి క్రమం తప్పకుండా నీరు పోస్తూ సంరక్షించాలని గ్రామస్తులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మణ్ నాయక్, ఉప సర్పంచ్ భాగ్యరాణి శివ, పంచాయతీ కార్యదర్శి పద్మ, జిపిఓ సునీత, గ్రామ పెద్దలు బాలస్వామి, మల్లేష్, రాములు, శ్రీనివాస్ గౌడ్, బాలస్వామి, రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి,,వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ వివరాలు తప్పనిసరిగా నవీకరించాలి

- 0-5 ఏళ్ల చిన్నారులకు తొలి ఆధార్ నమోదు ఉచితం
- 5-15 ఏళ్లు పూర్తైన పిల్లలకు బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరి
- సంక్షేమ పథకాల కోసం ఆధార్ వివరాలు ఖచ్చితంగా ఉండాలి
- అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ బ్యూరో, జూలై 27 (జనంసాక్షి):** ప్రతి పౌరుడు తమ ఆధార్‌లోని వివరాలను సరి చూసుకుని అవసరమైతే వెంటనే నవీకరించు కోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈ-డిస్ట్రిక్ట్ అధికారులు, ఆధార్ కేంద్రాల నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బ్యాంకింగ్ సేవలు, విద్య, ఆరోగ్యం, పెన్షన్లు, రేషన్, స్కాలర్‌షిప్‌లు, రైతు ఆర్థిక సహాయం తదితర సేవలన్నింటికీ ఆధార్ కీలక గుర్తింపు పత్రంగా మారిందని తెలిపారు. అందువల్ల పేరు, జన్మతేదీ, చిరునామా, మొబైల్ నంబర్, బయోమెట్రిక్ వివరాలు తదితర సమాచారాన్ని సకాలంలో నవీకరించుకోవాలని సూచించారు. 0-5 సంవత్సరాల చిన్నారులకు తొలి ఆధార్ నమోదు ఉచితమని తెలిపారు. అలాగే 5-15 సంవత్సరాల వయస్సు పూర్తైన పిల్లలకు బయోమెట్రిక్ వివరాల నవీకరణ తప్పనిసరి అని, తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆధార్ కేంద్రంలో అప్‌డేట్ చేయించాలని కోరారు. ఆధార్ నమోదు లేదా నవీకరణ కోసం పోస్టాఫీసులు,



బ్యాంకులు, ప్రభుత్వం గుర్తించిన ఆధార్ కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని, అధికారిక కేంద్రాల్లోనే సేవలు పొందాలని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సందీప్, మీ సేవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వందశాతం పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 27(జనంసాక్షి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటరు ఎన్యూమరేషన్ పత్రాల సేకరణ ప్రక్రి య తుది దశకు చేరుకుంద ని, జిల్లాలో ఇప్పటికే దాదా పు 95 శాతం పూర్తయింద ని, మిగిలిన 5 శాతాన్ని కూడా బూత్ లెవల్ అధికా రులు, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు సమన్వయంతో పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక సూచించారు.
సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్‌లోని వీడి యో కాన్ఫరెన్స్ హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్.ఐ.ఆర్. పురోగతిపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్యూ మరేషన్ పత్రాల సేకరణ అనంతరం రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుం దని తెలిపారు.ఇంకా మిగి లిన 5 శాతం ఓటర్లలో కొందరి పేర్లు రెండు ప్రాంతా ల్లో ఉండే అవకాశం ఉంద ని, తమ ఓటు ఎక్కడ కొన సాగించాలనే సందిగ్ధంలో వారు ఉండవచ్చని పేర్కొ న్నారు.ఒక ఓటరుకు ఒకే చోట మాత్రమే ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటరు పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. ఓటర్లు తమ ఓటు ఎక్కడ కొనసా గించాలనుకుంటున్నారో నిర్ణయించుకుని, మరో ప్రాంతంలోని ఓటును రద్దు చేయించుకునేందుకు సంబంధిత బీఎల్‌వోకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ప్రస్తుతం ఓటు కొనసాగించదలిచిన పోలింగ్ కేంద్రాని కి చెందిన బీఎల్‌వోకు ఎన్యూమరేషన్ పత్రాలు పూర్తి చేసి అందజేయాలని తెలిపారు.
రాజకీయ పార్టీల కు చెందిన బీఎల్ఏలు తమ పరిధిలో ఇంకా ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించని ఓటర్లకు అవగాహన కల్పించి, వారు త్వరితగతిన పత్రాలు పూర్తి చేసి అందజేసేలా చర్యలు తీసుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్ సూచించారు.ఈ సమావే శంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, డీఆర్‌వో రాజేశ్వరి, సీ-సెక్షన్ అధికారి జయసుధ, రాజకీయ పార్టీల ప్రతినిధులు అబ్దుల్ సలీమ్, కెంచి శ్రీను, మహమ్మద్ సలీమ్, వెంకట్రాం రెడ్డి, రాఘవ చౌదరి, కెంచి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అబ్దుల్ కలాంకు ఘన నివాళి



**నారాయణపేట, జూలై 27(జనంసాక్షి):** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో సోమవారం మాజీ రాష్ట్రపతి ఏ పి జే అబ్దుల్ కలాం కు ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సభ్యత్వం చేపట్టి ఎబివిపి నూతన కమిటీని ఎన్నుకొన్నారు. విద్యార్థులందరూ కూడా ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఉన్నత లక్ష్యాలకు ఎలా చేరుకోవాలి నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కన్వీనర్ నరేష్ నగర కార్యదర్శి సతీష్ కళాశాల అధ్యక్షులు తరుణ్, రోహిత్, అభి, లక్ష్మీ కాంత్ రెడ్డి, చరణ్, సంతోష్,కార్యకర్తలు,కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**అచ్చంపేట, జిల్లా 27 (జనంసాక్షి):** సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. అచ్చంపేట మండలం సిద్ధాపూర్‌లో పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను వివరించి, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. బ్యాంకు అధికారులు, పోలీసులు, ఇతర ప్రభుత్వ శాఖల పేరుతో ఫోన్ చేసి ఓటీపీ, ఏటీఎం కార్డు వివరాలు, పిన్, బ్యాంకు ఖాతా సమాచారం అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని పోలీసులు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయడం, అనుమానాస్పద యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం వల్ల ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. సోషల్ మీడియాలో పరిచయం లేని వ్యక్తులతో వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలను పంచుకోవద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో ఎస్సై అంజయ్య. పోలీసు సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు

## ఎన్యుమరేషన్ ఫారాలు జులై 31లోపు అందజేయాలి

- ఉర్కొండ తహసిల్దార్ యూసుఫ్ అలీ



**ఉర్కొండ, జూలై 27, (జనంసాక్షి);** ఓటర్లకు పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలు జులై 31 లోగా అందజేయాలని, మండల పరిధిలోని గ్రామాల్లో ఎన్యుమరేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని ఉర్కొండ తహసిల్దార్ యూసుఫ్ అలీ తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లోని ప్రతి ఇంటి నుంచి వివరాల సేకరణ జరుగుతుందని, జులై 31 లోపు అందరూ తప్పనిసరిగా ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బి ఎల్ ఓ లకు అందజేయాలని లేనిచో మీరు ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని సూచించారు. మండలంలో డిజిటైటేషన్ 95.86 శాతం పూర్తయిందని ఇంకా ఎన్యుమరేషన్ ఫారాలు 753 పెండింగ్ లో ఉన్నాయని తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్, మొబైల్ నంబర్ వంటి సమాచారాన్ని సరిగ్గా నింపి ఇవ్వాలని తహసిల్దార్ కోరారు. గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు ఈ ప్రక్రియలో సహకరించి 100% లక్ష్యాన్ని సాధించేలా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో గర్భాశయ క్యాన్సర్‌కు చెక్

**తెల్కపల్లి, జూలై 27,(జనంసాక్షి):** భారతదేశంలో ప్రతి ఏడాది లక్ష మంది మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడుతున్నారని, 14 ఏళ్లు నిండిన ప్రతి బాలిక తప్పనిసరిగా హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవాలని వైద్యాధికారులు భానుప్రకాష్, అరవింద్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ బాలికల కళాశాలలో 41 మంది విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, క్యాన్సర్‌కు చికిత్స చేయడం కంటే ముందస్తు నివారణ ఎంతో ఉత్తమమని తెలిపారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ఎలాంటి అపోహలు అవసరం లేదని, ప్రపంచవ్యాప్తంగా 20 ఏళ్లకు పైగా ఈ టీకా సురక్షితంగా వినియోగంలో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు వీర్‌పాల్, యశోద, హెల్త్ అసిస్టెంట్లు సందీప్‌రెడ్డి, రవీందర్‌రావు, ఏఎన్ఎంలు కవిత, శాంత, పుష్ప, రత్నమాల, ఫార్మాసిస్ట్ సాయిరాం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## మిషన్ భగీరథలో లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

**టేక్మాల్,అల్లదుర్గ్, జూలై 27 (జనంసాక్షి):** మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందిస్తున్న తాగునీటి సరఫరాలో ఎలాంటి లీకేజీలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మిషన్ భగీరథ అధికారులకు, సిబ్బందికి సూచించారు. సోమవారం టేక్మాల్, అల్లదుర్గ్ మండల కేంద్రాల్లోని మిషన్ భగీరథ నీటి సరఫరా పంపింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, నీటి సరఫరా వ్యవస్థలో లీకేజీలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో నీటి నిల్వ ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి, తాగునీటి నాణ్యతకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**గుండుమాల్, జూలై 27(జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నటువంటి పనులలో ఒక్కటైనా పట్టణాల అభివృద్ధిలో భాగంగా గుండుమాల్ మండలంలోని బోగారం గ్రామంలో 4వ వార్డులో అంగన్వాడీ కేంద్రం నుండి ఆంజనేయ స్వామి గుడి వరకు సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని గ్రామ సర్పంచ్ శేఖర్ గౌడ్ తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన నిధులతో డ్రైనేజీ, సీసీ రోడ్ల పనులను నాణ్యతతో నిర్మిస్తున్నామని, గ్రామ అభివృద్ధి కాంగ్రెసు పార్టీ ప్రధాన లక్ష్యమని, గ్రామంలో మౌలిక వసతులను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని, గ్రామ సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాయప్ప, గ్రామ కార్యదర్శి అచ్చన్న, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సూగప్పకు నివాళులు అర్పించిన పేట ముదిరాజ్ నాయకులు



**నారాయణపేట జూలై 27(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సత్యనారా యణ చౌరస్తాలో సీనియర్ నాయకుడు సూగప్ప ముది రాజ్ చిత్రపటానికి నారాయ ణపేట పట్టణ ముదిరాజ్ సంఘం నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.సోమవారం సూరప్ప అకాల మరణం చెందడ తో నారాయణపేట జిల్లా ముదిరాజ్ సంఘానికి తీరనిలోటని మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు క్రాంతి కుమార్ ముదిరాజ్ సంఘం నాయ కులు సరాఫ్ నాగరా జ్ ,కాకర్ల భీమయ్య లు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతం లో సూరప్ప నారాయణ పేట జిల్లా ముదిరాజ్ నాయకులకు చేశారు. అంతేకాకుండా ఆయన చేసిన సేవలను మర్చిపో లేని వారు అన్నారు. అనంతరం ఆయన సొంత గ్రామంలోని అంతక్రియలకు నారాయణపేట నుండి నాలుగు వాహనాలలో ముదిరాజ్ సంఘం నాయకులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.అంతక్రియలకు తరలి వెళ్లిన వారిలో కొనంగేరి హనుమంతు మిర్చి వెంకటయ్య మనోహర్ ప్రసాద్ గౌడ్ వకీల్ ప్రశాంత్ వకీల్ సంతోష్ కుమార్ లతోపాటు తదితరులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు.

## ఫిర్యాదుదారుల నుండి 12 ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్




**నాగర్‌కర్నూల్, జూలై 27 (జనంసాక్షి):** నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జి పాటిల్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు సూచనలు చేశారు. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి వచ్చిన 12 అర్జీలలో భూమికి సంబంధించిన అర్జీలు 08, తగు న్యాయం సంబంధించిన అర్జీలు 04 స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ కి పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, ఎవరి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని జిల్లా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలియజేశారు.

## వ్యవసాయ శాఖ ద్వారా ప్రతి రైతు వేదికలో విత్తనాల పంపిణీ



**అమరచింత, జూలై 27 (జనంసాక్షి):** సోమవారం నాడు నాగల్ కడుమూర్ రైతు వేదికలో వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం నిర్దేశించిన విధానం ప్రకారం విత్తనమేళాను ఈరోజు ఈనెల 27వ తారీకు నుండి 29వ తారీకు మూడు రోజులు పాటు నిర్వహించడానికి గాను ఈరోజు నాగలకడమూర్ రైతు వేదికలో విత్తన మేల సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది ప్రభుత్వం తీసుకున్నటువంటి నిర్ణయాన్ని రైతులకు తెలియజేయడము జరిగింది.అదేవిధంగా ప్రస్తుత సీజన్లో ఆరుతడి పంటలు అయినటువంటి కంది,మినుము,ఆముదం పంటల విత్తనాలను రైతువేదికలో ముందస్తుగా రైతులకు అందుబాటులో ఉంచుతామని రైతులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రజాప్రతినిధులు,రైతులు,విత్తన డీలర్లు,స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారి నందకిషోర్ రెడ్డి ఏవో అరవింద్ గ్రామ రైతులు తదితరులు పాల్గొనడం జరిగింది.

## కార్మికుల భద్రతకు భరోసా.. రూ.20 లక్షల ప్రమాద బీమా

- గ్రామ సర్పంచ్ యాబన్న గారి రవితేజ రెడ్డి




**కొల్చారం, జూలై 27 (జనంసాక్షి):** కొల్చారం మండలంలోని పైతర గ్రామ పంచాయతీ కార్మికులకు రూ.20 లక్షల ప్రమాద బీమా చేయించి, బీమా పత్రాలను గ్రామపంచాయతీ కార్మికులకు అందజేశారు. కార్మికుల భద్రత, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బీమా సౌకర్యాన్ని కల్పించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పైతర గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, ఉపసర్పంచ్ సుధాకర్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్ పాల్గొన్నారు.

## డా. ఏపీజే అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



**వెల్దండ, జూలై 27 (జనంసాక్షి):** క్షిపని రంగంలో భారత ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం సేవలు మరువలేనివని నాగర్ కర్నూల్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి మూడవ మోతిలాల్ నాయక్ అన్నారు.కలాం వర్ధంతి సందర్భంగా వెల్దండ మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి బాణావత్ శంకర్ నాయక్,సేవాదళ్ ఉపాధ్యక్షుడు పుల్లయ్య . తలారి జంగయ్య తిరుపతిరెడ్డి. రషీద్ మాజీ సర్పంచ్ భక్యా నాయక్. సర్పంచులు. కేష్య నాయక్. సుధీర్ నాయక్. ఈదులపల్లి శ్రీనివాస్. మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లక్ష్మాపూర్-దంతేపల్లి రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి : ప్రజావాణిలో జేసీకి వినతి

- రూ.4.13 కోట్లతో టెండర్ పూర్తై మూడేళ్లు గడిచినా ముందుకు కదలని పనులు
- ఆరు గ్రామాల ప్రజలు,విద్యార్థులు,రైతులు, ప్రయాణికులకు నిత్యం అవస్థలు



**రామాయంపేట, జూలై 27 (జనంసాక్షి):** లక్ష్మాపూర్ స్టేజ్ నుంచి దంతేపల్లి గ్రామం వరకు ప్రతిపాదిత బీటీ రహదారి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ దంతేపల్లి గ్రామ సర్పంచ్ మస్కూరి బాలరాజు,సోమవారం మెదక్ జిల్లా ప్రజావాణిలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. లక్ష్మాపూర్,కాట్రియాల్, పర్వతాపూర్, కిషన్ తండా,జెమ్లాతండా,దంతేపల్లి గ్రామాలను కలుపుతూ ఉన్న ఈ ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని భారీ గుంతలతో ప్రమాదకరంగా మారిందన్నారు.ఈ రహదారిపై ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు పాఠశాల వాహనాలు,వ్యవసాయ వాహనాలు,ద్విచక్ర, ఆటోలు ,నాలుగు చక్రాల వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తున్నప్పటికీ,రహదారి అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.4.13 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తై మూడు సంవత్సరాలు గడిచినా కాంట్రాక్టర్ ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 20 ఏళ్ల క్రితం నిర్మించిన రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్‌లు, విద్యార్థుల రాకపోకలు,రైతుల వ్యవసాయ ఉత్పత్తుల రవాణా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని వివరించారు. ఈ సమస్యను ఇప్పటికే ఎమ్మెల్యే, ఎంపీ తో పాటు సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత కాంట్రాక్టర్‌ను వెంటనే పిలిపించి రహదారి నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కాట్రియాల్ గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త స్రవంతి రాజేందర్ గుప్తా,దంతేపల్లి గ్రామసర్పంచ్ మస్కూరి బాలరాజు పాల్గొన్నారు.

## క్రీడలతోనే మానసిక వికాసం, ఉజ్వల భవిష్యత్తు



**జడ్చర్ల, జూలై 27 (జనంసాక్షి):** క్రీడల వల్ల విద్యార్థులకు ఆనందంతో పాటు పరిపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మండల పరిధిలోని వల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జగదీష్ కుమార్ అన్నారు. సోమవారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రామానికి చెందిన నాయకులు జలంధర్ నాయక్ సుమారు రూ.10 వేలు విలువ చేసే వాలీబాల్‌లను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా జలంధర్ నాయక్ మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక వికాసం కలిగి విద్యార్థులు చదువులోనూ రాణిస్తారని, దాతలు అందించే సహాయ సహకారాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, క్రీడల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలలో రాణించాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్ల సౌలభ్యం ఉంటుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు అంజనేయులు, ఇంతియాజ్, ఖజా పాషా, శ్రీనివాసులు, వ్యాయామ ఉపాధ్యాయులు దూమర్ల నిరంజన్, ఉపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాసులు, రాములు, శివ కుమార్, అనురాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ సిక్కం భూమిలో అక్రమ కట్టడాలు వెంటనే తొలగించాలి

- తహసీల్దార్‌కు సర్పంచ్ భీంపాకుల గెల్వమ్మ వినతి
- ఆక్రమణదారులపై కఠిన చర్యలకు అధికారుల హామీ





**ఉప్పునుంతల, జూలై 27 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండలం జప్తి సదగోడు గ్రామంలోని సర్వే నంబర్ 143లో ఉన్న ప్రభుత్వ సిక్కం భూమిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ భీంపాకుల గెల్వమ్మ తహసీల్దార్ అద్దంకి సునీతకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ భీంపాకుల గెల్వమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న కుమ్మరి కుంట పరిధిలోని ప్రభుత్వ సిక్కం భూమిలో కొందరు వ్యక్తులు నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ విషయపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా ఇప్పటికే రెండు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ వాటిని పట్టించుకోకుండా నిర్మాణ పనులను కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూములు గ్రామ ప్రజల ఉమ్మడి ఆస్తి అని, వాటిని ఆక్రమించడం వల్ల భవిష్యత్తులో ప్రజా అవసరాలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అందువల్ల రెవెన్యూ అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలను గుర్తించి అక్రమ నిర్మాణాలను తొలగించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ అద్దంకి సునీత స్పందిస్తూ ప్రభుత్వ భూములపై ఎలాంటి ఆక్రమణలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు అక్రమ నిర్మాణాలను శాశ్వతంగా తొలగిస్తామని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారులను వెంటనే స్థల పరిశీలన నిర్వహించి పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. అలాగే గ్రామాల్లో ప్రభుత్వ భూములు, ప్రజా రహదారులు, చెరువులు, కుంటలను పరిరక్షించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజేందర్ సింగ్, వెంకటయ్య, మాజీ సర్పంచ్ పద్మశ్రీహరి, సుధాకర్ రెడ్డి, బాలకాశన్న, అంజయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో ఫారం పాండ్ నిర్మాణానికి శ్రీకారం

- హరితహారంలో భాగంగా ప్రతి ఇంటికి మొక్కల పంపిణీ



**ఉప్పునుంతల, జూలై 27 (జనంసాక్షి):** ఉప్పునుంతల మండల పరిధిలోని ఉప్పరిపల్లి గ్రామ పంచాయతీలో వీబీజీరామ్‌జీ (ఉపాధి హామీ పథకం) కింద రైతు గడేల వెంకటేష్ వ్యవసాయ పొలంలో ఫారం పాండ్ నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఫారం పాండ్‌లను ఏర్పాటు చేసుకుని వర్షపు నీటిని నిల్వ చేసుకోవడం ద్వారా భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడుతుందని అన్నారు. గ్రామంలోని రైతులందరూ ప్రభుత్వ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హరితహారం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ప్రతి ఇంటికి పూల మొక్కలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాసాచారి, వార్డు సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్ మారోజు ఉమాపతి, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ రావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్
## రైతు వేదికలో ఘనంగా 'విత్తన మేళా'

• ఆరుతడి పంటల సాగుపై రైతులకు నిపుణుల సూచనలు



నర్సాపూర్, జూలై 27 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు నర్సాపూర్ మండలంలోని రైతు వేదికలో సోమవారం విత్తన మేళాను నిర్వహించారు. ప్రస్తుతం నెలకొన్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులను ఒకేచోట అందుబాటులో ఉంచి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ మేళాలో కూరగాయలు, మొక్కజొన్న, జొన్న, కందులు, పెసర్లు, పశు గ్రాసం విత్తనాలతో పాటు నానో యూరియా, నానో డీఏపీ రైతులకు అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి దీపిక, వ్యవసాయ విస్తరణ అధికారులు మోహన్ తేజస్విని, రాజశేఖర్, లావణ్య, దుర్గా ప్రసాద్, విత్తన డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం,
## పంటల మార్పిడి పై అవగాహన సమావేశం



రామాయంపేట, జూలై 27 (జనంసాక్షి): రామాయంపేట మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ ప్రత్యేక అధికారి సురేష్ (సీపీఓ) అధ్యక్షతన మండల సర్పంచులు, మండల స్థాయి అధికారులు, వి.బి.జీ.ఆర్.ఏ.ఎం.జీ (VBGRAMG) సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జలసిరి కార్యక్రమాల అమలు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంటల మార్పిడి విధానాలు, నీటి వనరుల సంరక్షణ వంటి అంశాలపై సంబంధిత అధికారులు సర్పంచులకు వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో షాజోల్దీన్, వ్యవసాయ శాఖ అధికారి ప్రవీణ్ కుమార్, పశుసంవర్ధక శాఖ అధికారి, ఏఈ (పంచాయతీ రాజ్), ఏఈ (ఆర్‌డబ్ల్యూఎస్), వి.బి.జీ.ఆర్.ఏ.ఎం.జీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండలం లోని సర్పంచులు పాల్గొన్నారు.

## పద్మమ్మకు నివాళులర్పించి
## కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



ఉప్పునుంతల, జూలై 27 (జనంసాక్షి): ఉప్పునుంతల మండలం కొటికల్లు గ్రామానికి చెందిన బోధనపల్లి రామచంద్రారెడ్డి సతీమణి, టీ-శాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి చిన్నమ్మ పద్మమ్మ దశదినకర్మ కార్యక్రమానికి టీపీసీసీ ఉపాధ్యక్షులు, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు కట్ట అనంత రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కర్నె లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ అంతటి మల్లేష్, అచ్చంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్ము బుచ్చిరాములు, హరినారాయణ గౌడ్, నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి
## హెల్పింగ్ హాండ్స్ ఆర్థిక సహాయం

రేవల్లి, జూలై 26 (జనంసాక్షి): రేవల్లి మండలంలోని తల్పునూర్ గ్రామానికి చెందిన కోళ్ల బాలయ్య తండ్రి బాలయ్య (39), కడుపునొప్పి భరించలేక శుక్రవారం తెల్లవారుజామున పురుగుల మందు తాగి, చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు బాలయ్య కుటుంబానికి 5000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో
## రైతులు అప్రమత్తంగా ఉండాలి

• ఏఎంసి వైస్ చైర్మన్ సాదుల పవన్



నంగునూరు, జూలై 27(జనంసాక్షి): నంగునూరు రైతు వేదికలో సోమవారం ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను నంగునూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సాదుల పవన్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తగ్గే అవకాశం ఉందని చెప్పారు. అందువల్ల రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని అన్నారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. వెల్లిన శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే దిగుబడులు మెరుగుపడతాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షపాతం తగ్గితే పంటలపై పడే ప్రభావాన్ని వివరించారు. రైతులు తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నంగునూరు మండల రైతులు, విత్తన డీలర్లు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. విత్తన మేళా ఈ నెల 27, 28, 29 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## చిమనగుంటపల్లిలో
## కాంగ్రెస్, బీజేపీకి షాక్..

• బీఆర్ఎస్‌లోకి కార్యకర్తల చేరిక



వనపర్తి రూరల్, జూలై 27, (జనంసాక్షి): వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ లక్ష్యమని, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో ప్రతి కార్యకర్త కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు పేదలకు గొప్ప ఆసరా

వెల్దండ, జూలై 27 (జనంసాక్షి): వెల్దండ మండలం తిమ్మినోనిపల్లి గ్రామంలో ఎల్బీనగర్ కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ మడావత్ శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు ఉచితంగా వైద్య వైద్య పరీక్షలు చేసి, డబ్బులు లేని నిరుపేద ప్రజలు ఆస్పత్రులకు వెళ్లలేనప్పుడు ఇవి వారి యొక్క ఆర్థిక భారాన్ని తగ్గించి, వ్యాధులను ముందస్తుగా గుర్తించి ప్రారంభ దశలోని పెద్ద ముప్పును నివారించవచ్చని అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు హరి కిషన్ నాయక్, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, కామినేని ఆసుపత్రి సీనియర్ ఎగ్జిక్యూటివ్ కే దేవేందర్ గౌడ్, వైద్య సిబ్బంది, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జనగణన విధులు నిర్వహించిన
## ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి

• డీఈవోకు పీఆర్టీయూ టీఎస్ సిద్దిపేట జిల్లా శాఖ వినతి



సిద్దిపేట, జూలై 27 (జనంసాక్షి): జనగణన-2027 తొలి దశలో వేసవి సెలవుల సమయంలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని పీఆర్టీయూ టీఎస్ తెలంగాణ సిద్దిపేట జిల్లాశాఖ డీఈవో రమేశ్ కు సోమవారం వినతిపత్రం సమర్పించింది. జనగణన-2027 తొలి దశను విజయవంతం చేశారని తెలిపారు. వేసవి సెలవుల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్జిత సెలవులు మంజూరు చేయడం సముచితమన్నారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి జిల్లాలో జనగణన విధుల్లో పాల్గొన్న ప్రతి ఉపాధ్యాయునికి ఆర్జిత సెలవులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఈ వినతిని సానుకూలంగా పరిశీలించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు పీఆర్టీయూ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ సిద్దిపేట జిల్లా శాఖ నాయకులతో పాటు మద్దూరు మండల శాఖ అధ్యక్షుడు కామిడి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## పుణే-బారామతి 100 కి.మీ
## అల్ట్రారన్ పూర్తిచేసిన సిద్దిపేట రన్నర్ రాజు

• పూణేలో ఘన సత్కారం
• సిద్దిపేటలో హర్షం వ్యక్తం చేస్తున్న రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, స్నేహితులు



సిద్దిపేట (జనంసాక్షి): సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నునిగాని రాజు మహారాష్ట్రలో బారామతి స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వహించిన ప్రతిష్ఠాత్మక పుణే-బారామతి 100 కిలోమీటర్ల అల్ట్రారన్‌ను విజయవంతంగా పూర్తిచేశారు. 100 కిలోమీటర్ల అల్ట్రారన్‌ను అత్యంత కఠినమైన ఎండ్యూరెన్స్ పరీక్షగా భావిస్తారు. అయినప్పటికీ పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధనతో రాజు ఈ సవాలును విజయవంతంగా అధిగమించారు. నునిగాని రాజు సాధించిన ఈ ఘనత పట్ల క్రీడాభిమానులు, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలిపారు.

## మద్యం మత్తులో 'పెద్ద మనుషులు'..
## రోడ్డుపై రాలిన అమరావతి యువకుడి ప్రాణం!



గద్వాల ప్రతినిధి, జూలై 27(జనంసాక్షి): రెక్కాడితే గాని డొక్కాడని బతుకు ఆ 24 సంవత్సరాల కుర్రోడిది, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి ప్రాంతానికి చెందిన 24 సంవత్సరాల సునీల్ అనే యువకుడు బతుకుదెరువు కోసం గద్వాల పట్టణానికి వచ్చాడు. పగలు ఒక ప్రైవేట్ ల్యాబ్‌లో సాంకేతిక నిపుణుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ, రాత్రి వేళల్లో కుటుంబానికి అండగా ఉండటానికి రాపిడో డ్రైవర్‌గా అదనపు శ్రమ చేస్తున్నాడు. మృత్యువులా దూసుకొచ్చిన విలాసవంతమైన కారు రాత్రి సుమారు 11:30 గంటల ప్రాంతంలో రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ సమీపంలో సునీల్ తన మోటార్ సైకిల్‌పై విధి నిర్వహణలో ఉన్నాడు. అదే సమయంలో గద్వాల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు ప్రముఖులు పూర్తి స్థాయిలో మద్యం మత్తులో మునిగిపోయి, కారును అమిత వేగంతో నడుపుతూ దూసుకొచ్చారు. మద్యం మత్తులో కారుపై



నియంత్రణ కోల్పోయిన వారు, సునీల్ నడుపుతున్న బైక్‌ను బలంగా ఢీకొట్టారు. ఈ ఘోర ప్రమాదంలో ఎటువంటి తప్పు లేని ఆ యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కష్టపడి పైకి వస్తూ, కుటుంబానికి దీపంగా మారతాడనుకున్న యువకుడు, ఇలా బాధ్యతారహితమైన వ్యక్తుల విలాసాలకు బలవడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది. సమాజం ఆలోచించాల్సిన ప్రశ్నలు,హోదా ఉంటే సరిపోతుందా, సమాజంలో ప్రముఖులుగా చలామణి అవుతున్న వ్యక్తులకు కనీస సామాజిక బాధ్యత లేదా? చట్టాల పట్ల భయం ఎక్కడ?'డ్రింక్ అండ్ డ్రైవ్' ప్రాణాంతకమని తెలిసి కూడా చట్టాలను చేతుల్లోకి తీసుకునే ఇలాంటి వారిపై కఠిన చర్యలు ఎప్పుడు తీసుకుంటారు? కన్నవారికి కడుపుకోత మిగిల్చిన ఈ ఘటనపై బాధితుడి కుటుంబానికి న్యాయం జరగాలని, దోషులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## స్వల్పకాలంలో అధిక దిగుబడినిచే పంటలను వేసుకోవాలి

• సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి



**మల్దకల్ జులై 27 (జనంసాక్షి):** తక్కువ నీటితో సాగయే పంటలను ఎంపిక చేసుకోవడం ఉత్తమ మార్గమని సింగిల్ విండో అధ్యక్షుడు శేషంపల్లి తిమ్మారెడ్డి అన్నారు. సోమవారం రైతు వేదికలో విత్తనమేళ అవగాహన సదస్సు నిర్వహించారు. రైతు వేదికలో నిర్వహించి విత్తనమేళను తప్పకుండా సందర్శించి విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి నీటి వాడకం చాలా కీలకమని,అందుకే తక్కువ నీటితో వచ్చే మొక్కజొన్న, కంది పెసర,సజ్జ వంటి పంటలు వేసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారి రాజశేఖర్ మాట్లాడుతూ స్వల్పకాలిక వర్షాధార పంటలు కూరగాయలు సాగు చేస్తూ లాభసాటి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని, పంట మార్పు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో స్వల్పకాలంలో అధిక దిగుబడినిచ్చే విత్తనాలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. ధ్రువీకరించిన విత్తనాలను కొనుగోలు చేయాలని ఆయన తెలిపారు.విత్తన మేళలో అవగాహన సదస్సులో కాంగ్రెస్ నాయకులు వెంకటన్న, నరేందర్,మధు, పరశురాముడు,ఉప్పరి నారాయణ,ఊరబాయి రాజు,తిమ్మరాజు, వ్యవసాయ శాఖ అధికారులు విస్తీర్ణ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మద్దూరు మండల రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక



**మద్దూరు, జూలై 27 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఆథరైజ్డ్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సోమవారం రోజు మద్దూరు మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా గంగుల సంజీవరెడ్డి, కార్యదర్శిగా ఈ. నర్సింలు, కోశాధికారిగా ఎం. వెంకటయ్య, ఉప అధ్యక్షులు కవిత, జిల్లా కార్యవర్గం సమక్షంలో రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటరమణ, జిల్లా కార్యదర్శి వెంకటేష్, జిల్లా కోశాధికారి వై తిరుపతిరెడ్డి, మరియు మద్దూరు మండల డీలర్ల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోబడినారు.

## పండించే పంటలు మార్చితేనే జీవితాలు మారుతాయి

• ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి



**దరూరు, జూలై 27(జనంసాక్షి):** గద్వాల నియోజకవర్గం ధరూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనం వద్ద ఈరోజు రైతుల విత్తన మేళా, అవగాహన సదస్సు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీ బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు హాజరయ్యారు. గ్రామ సర్పంచ్, వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు పూల మొక్కతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి విత్తన మేళాను ప్రారంభించి, స్టాల్స్ ను సందర్శించారు. రైతులకు తన చేతుల మీదుగా మొక్కజొన్న విత్తనాలు అందజేశారు.ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి రైతులు అగ్రికల్చర్ కంటే హార్టికల్చర్ పంటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి. కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల పంటలు తక్కువ నీటితో ఎక్కువ లాభం ఇస్తాయని తెలిపారు.

ప్రాజెక్టుల్లో నీళ్లు లేకపోవడంతో వరి సాగును వీలైనంత తగ్గించాలి. "నీటి వనరులను పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని, చెరువులు, కుంటలు, కాలువలను సంరక్షించి వర్షపు నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు.ఎల్ నినో వల్ల వ్యవసాయ పనులు తగ్గాయి. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు తగ్గకుండా ఉపాధి హామీ పథకం కింద ఎక్కువ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు.పశువులకు తాగునీరు, మేత కొరత రాకుండా మేత విత్తనాలు అందించే ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే పంట నష్టాలను తగ్గించుకోవచ్చని, రైతులు–అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే గారు అన్నారు.జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ తక్కువ నీటితో పండే పంటలపై ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ఫామ్ పాండ్ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ హనుమంతు, సర్పంచ్ డి.ఆర్ విజయ్, మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, డివై రామన్న, జిల్లా, మండల వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## పథకం ప్రకారం మహిళా హత్య

• నిందితుల అరెస్ట్ : ఎస్పీ డాక్టర్ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 27(జనంసాక్షి):** నగల కోసం ఒక మహిళను పథకం ప్రకారం హత్య చేశారని నిందితుల ను సోమవారం అరెస్ట్ చేశా మని జిల్లా ఎస్పీ వినీత్ తెలిపారు.విలేకరుల సమా వేశంలో వివరాలు వెల్లడిం చారు.మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాదవ రావుపల్లి గ్రామానికి చెంది న గొయికల శాంతమ్మ (45) అదృశ్యమైనట్లు ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల15న మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.దర్యాప్తులో భాగంగా మృతురాలి వద్ద ఉన్న బంగారు నగలను దోచుకోవాలనే ఉద్దేశంతో ఎ1జోగు రాజు,ఎ2 బడుగుల భాస్కర్,ముందుగానే పథకం రచించినట్లు పోలీసులు గుర్తించారు.ఈ క్రమంలో ఈ నెల12న శాంతమ్మను ఫోన్ ద్వారా మద్దూర్‌కు రప్పించి, మోటార్ సైకిల్‌పై జాజాపూర్ చెరువు సమీ పంలోని చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి, మద్యం సేవించిన అనంతరం ఆమెతో శారీర కంగా కలిసి, చున్నీతో గొంతు బిగించి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందనీ తెలిపారు.

హత్య అనంతరం మృతు రాలి వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలు,సెల్ ఫోన్,పర్సు, ఆధార్ కార్డు ను తీసుకుని, ఆధారాలను నాశనం చేసే ఉద్దేశంతో వాటిని బోరు కేసింగ్‌లో పడవేశారు.అనంతరం బంగారు నగలను నారా యణపేటలో విక్రయించి వచ్చిన నగదును ఇద్దరూ పంచుకున్నట్లు నిందితులు ఒప్పుకున్నారని ఎస్పీ తెలిపారు.నిందితుల వద్ద నుంచి ఒక తులం బంగారు ఆభరణాలు (కమ్మలు,మ్యాట్నీలు, పుస్తెల గుండ్లు),50 తులాల వెండి ఆభరణాలు (కడియాలు, పట్టీలు), రూ.50,000 నగదు, నేరానికి ఉపయో గించిన రెండు మోటార్ సైకిళ్లు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అలాగే దొంగిలించిన బంగారు నగలను కొను గోలు చేసిన జాజాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ ఎ 3ను కూడా అరెస్ట్ చేసి,ముగ్గురు నిందితులను న్యాయస్థానంలో హాజరు పర్చి రిమాండ్‌కు తరలించి నట్లు తెలిపారు.ఈ కేసును డీఎస్పీ ఎన్. లింగయ్య పర్యవేక్షణలో అత్యంత సమర్థవంతంగా ఛేదించిన కోస్గి సీఐ సైదులు,మద్దూర్ ఎస్ఐ బి. శ్రీనివాసులు, ఏఎస్ఐ బాలయ్య, హెడ్ కానిస్టేబుళ్లు పెంటయ్య, గోపాల్, బి. రాజు, పోలీసు కానిస్టేబుళ్లు పుల్చా నాయక్, నాగమల్లయ్య, పరందాములు, సీసీఎస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందిం చారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూజిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే నేరాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. నేరాలను అరికట్ట డంలో ప్రజలు పోలీసులకు సహకరించాలని,అనుమా నాస్పద వ్యక్తులు లేదా సంఘటనల గురించి వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

## వంగూరులో ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయాలకు శ్రీకారం

• స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



**వంగూర్ నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, జులై 27(జనంసాక్షి):** మండల ప్రజలకు అన్ని ప్రభుత్వ సేవలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వంగూరు మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ మండల స్థాయి ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు కసరత్తు ప్రారంభమైంది. ఈ మేరకు వంగూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న సుమారు ఏడున్నర ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సోమవారం పరిశీలించారు.ప్రతిపాదిత స్థల విస్తీర్ణం, సరిహద్దులు, ప్రభుత్వ భూమి అందుబాటు, భవిష్యత్ విస్తరణకు ఉన్న అవకాశాలు, రాకపోకలకు అనువైన మార్గాలు, మౌలిక వసతుల కల్పనకు ఉన్న సౌకర్యాలను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే ప్రతిపాదిత ప్రాంగణంలో రెవెన్యూ, వ్యవసాయం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యుత్, వైద్య ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం తదితర ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఒకే చోట ఏర్పాటు చేసే అవకాశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ మండల స్థాయి కార్యాలయాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన సర్వే నంబర్లు, విస్తీర్ణం, యాజమాన్య హక్కులు, భౌగోళిక పరిస్థితులు, మౌలిక వసతులు, ఇతర సాంకేతిక అంశాలతో కూడిన సమగ్ర నివేదికను సిద్ధం చేసి వెంటనే రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నివేదికలు వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఉండేలా పూర్తి వివరాలను పొందుపరచాలని, ఎలాంటి వివాదాలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ మండల స్థాయి కార్యాలయాల ఏర్పాటు ద్వారా ప్రజలు వివిధ శాఖల కార్యాలయాల కోసం వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, ఒకే ప్రాంగణంలో అన్ని ప్రభుత్వ సేవలు అందుబాటులోకి రావడంతో ప్రజల సమయం ఆదా కావడంతో పాటు పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతుందని కలెక్టర్ తెలిపారు.అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, ప్రజా పరిపాలనను గ్రామీణ ప్రాంతాలకు మరింత చేరువ చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పంలో భాగంగానే ఇంటిగ్రేటెడ్ మండల స్థాయి కార్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అన్ని శాఖల కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగవంతంగా, సులభంగా అందుతాయని అన్నారు. వంగూరు మండలంలో ఇందుకు అనువైన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండటం సంతోషకరమని, అవసరమైన ప్రతిపాదనలను త్వరితగతిన రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యాలయ సముదాయం పూర్తయితే మండల ప్రజలకు ఆధునిక పరిపాలనా సేవలు మరింత చేరువవడంతో పాటు ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం పెరిగి ప్రజలకు మెరుగైన సేవలు అందే అవకాశముందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కె.వి.ఎన్. రెడ్డి, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మోహన్, రెవెన్యూ శాఖ అధికారులు, మండల స్థాయి అధికారులు, ఇంజినీరింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కంప చెట్లతో నిండిన అడ్డాకుల పెద్ద చెరువు కట్ట

• పట్టించుకోని అధికారులు ప్రజా ప్రతినిధులు



**అడ్డాకుల, జూలై 27 (జనంసాక్షి):** అడ్డాకుల మండల పరిధిలోని పెద్ద చెరువు పరిస్థితి దయనీయంగా మారింది వాటిని గురించి పట్టించుకునే వారు లేక చెరువు అనే ఆనవాళ్లుకోల్పోతున్నాయి.చెరువు కట్టపై కంపచెట్లు పిచ్చి మొక్కలు విచ్చలవిడిగా పెరిగిపోయి చెరువు భద్రత దెబ్బతింటుంది గత ఐదేళ్లుగా వీటి బాగోవుల గురించి పట్టించుకోని అధికారులు ప్రజాప్రతి నిధులు నాయకులు కరువయ్యారు అడ్డాకుల పెద్ద చెరువు కింద వందల ఎకరాలకు ఆయకట్టు ఉంది చెరువు కట్ట పైన ఏపుగా కంప చెట్లు పెరిగిపోవడంతో కట్ట బలహీనంగా మారింది ఎలుకలు రంధ్రా లు చేయడంతో కట్ట దెబ్బతిని కొన్నిచోట్ల గండ్లు పడే అవకాశం ఉంది పాలక వర్గం గాని పంచాయతీ కార్యదర్శి గాని ఇరిగేషన్ అధికారులు గానీ ఇంతవరకు చెరువును పట్టించుకునే పాపాన పోలేదు ఏ పుగా కంప చెట్లు పిచ్చి మొక్కలు పెరగడంతో చెరువు కట్ట ఏక్కడ ఉందో కూడా కనిపించకపోవడం కోసమెరుపు చెరువు కట్టపై కంప చెట్లు పిచ్చిమొక్కలుపెరగడంవల్ల చెరువు కట్టభద్రతదెబ్బతింటుంది. దీని వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహం పెరిగినప్పుడు కట్ట తెగిపోయే ప్రమాదం ఉంది చెరువు కట్ట కింద ఒక దగ్గర నీటిని చిమ్మరిస్తుంది వీటిని ఇలాగే వదిలేస్తే కట్ట ధ్వంసమై పంటలు మునిగిపోయి రైతులు నష్టపోయే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని స్పందించి సరి చేస్తారని రైతులు కోరుకుంటున్నారు.

# వనపర్తిలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సుడిగాలి పర్యటన

**విద్యార్థులతో మమేకం • ఓటరు జాబితా సవరణపై అవగాహన • బీఆర్ఎస్‌లో చేరికలు •పార్టీ నేతకు నివాళి**



**వనపర్తి బ్యూరో, జూలై 27 (జనంసాక్షి):** మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదివారం వనపర్తి పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటిస్తూ వరుస కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విద్యార్థులతో మమేకమై సమాజం, ప్రజాస్వామ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించారు. అలాగే బీఆర్ఎస్ పార్టీలో చేరిన కార్యకర్తలను ఆహ్వానించి, పార్టీ సీనియర్ నాయకుడు కొట్టం దామోదర్ రెడ్డికి నివాళులర్పించారు.వనపర్తి 17వ వార్డులోని ఉర్దూ బాలికల ప్రాథమిక పాఠశాలను సందర్శించిన నిరంజన్ రెడ్డి,విద్యార్థినులతో కాసేపు ఉపాధ్యాయుడిగా మారి ఉర్దూ భాషలోనే పాఠాలు బోధించారు. విద్యార్థులే దేశ భవిష్యత్తని పేర్కొంటూ, సమాజం పట్ల బాధ్యత, ప్రజాస్వామ్య విలువలు, దేశ ఆర్థికాభివృద్ధిలో యువత పాత్ర వంటి అంశాలను వివరించారు. తెలంగాణకు సంబంధించిన పలు ప్రశ్నలను బోర్డుపై రాసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు.

అనంతరం పట్టణంలో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బూత్‌ల వారీగా పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని, పారదర్శక ఓటరు జాబితా బలోపేత ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని అన్నారు. గడువు ముగిసేలోపు బీఎల్ఓలు, బీఎల్ఏలు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేసి అర్హులందరి పేర్లు తుది జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. చురుకుగా పనిచేస్తున్న బీఎల్ఓలు, బీఎల్ఏలు, పార్టీ కార్యకర్తలను అభినందించి సన్మానించారు.

వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు మాజీ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన నిరంజన్ రెడ్డి, పాత–కొత్త నాయకులు సమన్వయంతో పనిచేసి గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనపూర్ మండలం ఉప్పరిపల్లి గ్రామంలో తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కీ.శే. కొట్టం దామోదర్ రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన నిరంజన్ రెడ్డి, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి కుటుంబానికి మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్‌తో పాటు పార్టీ జిల్లా, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి వ్యక్తిగత సోక్‌పిట్లు, కమ్యూనిటీ సోక్‌పిట్లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, ఫార్మ్ పాండ్లు వంటి నీటి సంరక్షణ నిర్మాణ పనులను గుర్తించి ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు 83 వేల వ్యక్తిగత సోక్‌పిట్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, అక్టోబర్ నాటికి కనీసం 30 వేల సోక్‌పిట్లు పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న బోర్‌వెల్లు, చేతి పంపులు, ఓవర్‌హెడ్ నీటి ట్యాంకుల వద్ద అవసరమైన చోట రీచార్జ్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు స్థలాలను గుర్తించి అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశించారు.ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఆరోగ్య ఉపకేంద్రాలు తదితర అన్ని ప్రభుత్వ సంస్థల్లో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. భవనాల పైకప్పులపై పడే వర్షపు నీటిని పైపుల ద్వారా సోక్‌పిట్లకు మళ్లించడం ద్వారా భూగర్భ జలాలను పెంచవచ్చని తెలిపారు.ప్రతి శాఖాధిపతి తమ పరిధిలోని ప్రభుత్వబి భవనాల్లో రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని, వచ్చే ప్రజావాణి సమావేశంలో చేపట్టిన పనుల పురోగతిని ఫొటోలు, జీపీఎస్ ఆధారాలతో సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) కింద వ్యక్తిగత మరుగుదొడ్లు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాల వద్ద శానిటరీ కాంప్లెక్స్‌లు, డ్రైనేజ్ ఎండ్ పాయింట్ సోక్‌పిట్ల నిర్మాణాలను కూడా వేగవంతం చేయాలని సూచించారు. అవసరమైన ప్రతిపాదనలు వెంటనే పంపిస్తే పరిపాలనా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. అదేవిధంగా జిల్లాలో 35 లక్షల మొక్కల నాటకం లక్ష్యాన్ని నిర్ణయించామని, ఇందులో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని కూడా సమాంతరంగా పూర్తి చేయాలని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తీవ్రమయ్యే అవకాశం ఉందని, అందువల్ల ప్రతి ప్రభుత్వ సంస్థ, ప్రతి గ్రామం, ప్రతి కుటుంబం నీటి సంరక్షణలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో అవగాహన కల్పించి నీటి సంరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి.హరిప్రియ, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, డి.ఆర్.ఓ ఎ.నిర్మల, జడ్. పి. సి. ఈ.ఓ, ఇంచార్జి డి. పి. ఓ వెంకట రెడ్డి, డి. ఆర్. డి.ఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వివాదాలకు కారణమవుతున్నా ప్రధానోపాధ్యాయుడిని బదిలీ చేయండి

**•స్కావెంజర్, సీసీహెచ్ నియామకాలపై ప్రజావాణిలో ఫిర్యాదు**



**మునిపల్లి, జూలై 27(జనంసాక్షి):** స్కావెంజర్, సీసీహెచ్ నియామకంపై గ్రామంలో వివాదాలు సృష్టిస్తున్న అల్లాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మన్‌ను బదిలీ చేయాలని ఎపిసీ చైర్మన్ యాదమ్మతో పాటు గ్రామస్తులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం జిల్లా విద్యాధికారికి వినతి పత్రం అందజేశారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని అల్లాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్కావెంజర్, కుక్–కమ్–హెల్పర్ (సీసీహెచ్) నియామక ప్రక్రియలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ (ఎపిసీ) తీర్మానాన్ని విస్మరించారని ఆరోపిస్తూ కమిటీ చైర్మన్ కె.యాదమ్మ కొన్ని రోజులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ మధ్య వివాదం కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు మండల విద్యాధికారి భీమ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఒక ప్రధానోపాధ్యాయుడికి మండల విద్యాధికారి ఎందుకు భయపడుతున్నారో అర్థం కావడం లేదని వారన్నారు. పాఠశాలలో ఇంత జరుగుతున్న ఎంఈఓ పట్టించుకోకపోవడంపై ఇద్దరి మధ్య ఏదో ఉందని అనుమానాలు వ్యక్తం చేశారు. రెండు నెలలు గడిచినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపారు. జిల్లా స్థాయిలో సమగ్ర విచారణ జరిపించి స్కావెంజర్, సీసీహెచ్ నియామకాలను వెంటనే పూర్తి చేయాలని, ప్రధానోపాధ్యాయుడిపై శాఖాపరమైన చర్యలు తీసుకుని ఆయనను బదిలీ చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు యాదమ్మ, గ్రామస్తులు వెల్లడించారు. ప్రధానోపాధ్యాయుడి వ్యవహారశైలి మారకపోతే తమ పిల్లలను ఈ పాఠశాల నుంచి తీసి ఇతర పాఠశాలల్లో చేర్పిస్తామని కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్చరించినట్లు తెలిపారు. సమస్య పరిష్కారం కాని ఎడల మరోసారి కలెక్టర్ ను జిల్లా విద్యాధికారిని కలుస్తామని వారు తెలిపారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌కు చెక్
# ఇద్దరు వాహనదారులకు జైలు శిక్షలు

అదేవిధంగా నది అగ్రహారం గ్రామానికి చెందిన రాముడు, వయస్సు 45 సంవత్సరాలు, వరుసగా మూడుసార్లు మద్యం సేవించి వాహనం నడుపుతూ గద్వాల ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడటంతో, సోమవారం కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించింది. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల వాహనదారుడితో పాటు ఇతర అమాయకుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదం ఏర్పడుతుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడే వారిపై ఇకపై కూడా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, మద్యం సేవించి వాహనం నడపకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.

## జొన్న పంటను పరిశీలించిన మండల వ్యవసాయ అధికారి



**మద్దూరు, జూలై 27 (జనంసాక్షి):** మద్దూరు మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేస్తున్న జొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి ఎ. ప్రవీణ్ కుమార్ క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా పంట ఎదుగుదల, మొక్కల ఆరోగ్య పరిస్థితి, పురుగులు మరియు తెగుళ్ల ఉధృతిని పరిశీలించారు. క్షేత్ర సందర్శనలో జొన్న పంటలో కాండం తొలుచు పురుగు మరియు ఆకులను నష్టపరిచే పురుగుల ఉనికిని గుర్తించారు. పురుగుల ఉధృతి కారణంగా ఆకులు దెబ్బతినడం, మొక్కల ఎదుగుదల మందగించడం, కాండం లోపలికి పురుగులు చొరబడటం వంటి లక్షణాలు కనిపించవచ్చని రైతులకు వివరించారు. జొన్న పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం ద్వారా పురుగు ఉధృతిని తగ్గించడంతో పాటు పంట దిగుబడిని పెంచుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి పేర్కొన్నారు. రైతులు తమ పొలాల్లో కనిపించే పురుగులు, తెగుళ్ల లక్షణాలను వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చి తగిన సాంకేతిక సలహాలు పొందాలని ఆయన సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# హెచ్ పి వివ్యాక్సిన్‌పై అవగాహన సదస్సు




**మల్దకల్ జూలై 27 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 14 నుంచి 17 సంవత్సరాల విద్యార్థినులకుహెచ్ పి వి హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్‌పై సోమవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది హెచ్ పివి వైరస్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో హెచ్ పి వి వ్యాక్సిన్ ప్రాముఖ్యత, సరైన వయస్సులో టీకా తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, అపోహలు–నిజాలు వంటి అంశాలపై విద్యార్థినులకు వివరించారు.అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెడ్‌మాస్టర్ రాజేశ్వర్ రెడ్డి, ఏఎన్ఎం కె. పుష్ప, పిహెచ్ఎన్ సత్యమ్మ,ఆశా కార్యకర్తలు నర్సమ్మ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

# అబ్దుల్ కలాంకు
# నివాళులర్పించిన ప్రజాసంఘాల నాయకులు



**అయిజ, జులై 27 (జనంసాక్షి):** అయిజ మున్సిపాలిటీ కేంద్రంలో జెడ్పిహెచ్ఎస్ బాయ్స్ హై స్కూల్ లో ఉన్న ఆయన విగ్రహానికి ఆయన 11వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలతో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల సీనియర్ ఉపాధ్యాయుడు శర్మ మాట్లాడుతూ,డాక్టర్ అబ్దుల్ కలాం గురించి గొప్ప మహోన్నత వ్యక్తి ఆయన ఉపాధ్యాయ వృత్తి నుండి శాస్త్రవేత్త దాక ఎదిగి ఎన్నో పరిశోధనలు చేసి రాకెట్లను ఇతర దేశాల వలె మన భారతదేశాన్ని ప్రపంచంలో గుర్తింపు వచ్చే విధంగా చేశాడని ఆయన భారతదేశానికి చాలా సేవలు చేశాడని ఆయన ఆశలను కొనసాగింపు దశగా మనమందరము కృషి చేయాలని ఈ సందర్భంగా గుర్తు చేశారు. నేటి యువత అబ్దుల్ కలాం వలె ఉన్నత విద్య అభ్యసించి దేశంలో ఉన్నతమైన గుర్తింపు పొందిన పనులు చేసి దేశానికి ఊరికి గర్వకారణంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు మాల మల్లికార్జున్, టిఆర్ఎస్ నాయకుడు అశ్వ పెద్దయ్య, గోరంట్ల స్వామి దాసు, క్రిస్టఫర్, మాజీ కౌన్సిలర్ మౌల, కనికీడు భాష, తూముకుంట కిష్టన్న, పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.